ప్రజాశక్తి

సోమవారం 16 సెప్టెంబర్ 2024 | 8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా



వరద బాధితుల సమస్యలు తెలుసుకుంటున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాబూరావు

ఉద్యోగ, కార్మికులను ఆదుకోండి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాబూరావు
- వరద ప్రభావిత ప్రాంతాల్లో నేతలు పర్యటన

విజయవాడ: బుడమేరు వరద ప్రాంతాలైన అజిత్ సింగ్‌నగర్, రామానగర్, వాంబే కాలనీ, శాంతినగర్, న్యూ రాజరాజేశ్వరిపేట తదితర ప్రాంతాల్లో సిపిఎం నేతలు ఆదివారం పర్యటించారు. బాధితులను, కార్మికులను, వారి కుటుంబాలను నేతలు కలుసుకొని పరామర్శించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు మాట్లాడుతూ వరదల వల్ల బాధితులు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయారన్నారు. అసంఘటిత కార్మికులు, చిరు ఉద్యోగులు, చిరు వ్యాపారులకు వరదలు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయన్నారు. కార్మికులకు గత 15 రోజులుగా పని లేదని, కొన్నిచోట్ల ఉద్యోగాల నుండి తొలగిస్తున్నారని తెలిపారు. ఇప్పటికే అప్పుల ఊబిలో ఉన్న బాధితులకు కొత్తగా అప్పులు ఇచ్చే నాథుడు కూడా కరువయ్యారన్నారు. ప్రభుత్వ సాయమూ నేటికీ అందలేదన్నారు. ఆటోలు పూర్తిగా దెబ్బతిన్నాయని, చిరు వ్యాపారం లేదని, ఇళ్ల దగ్గర ఉన్న సరుకు కొట్టుకుపోయిందని చెప్పారు. ఎన్యుమరేషన్, సమాచారం పేరుతో వస్తున్న అధికారులు, సిబ్బందికి సమాధానం చెప్పటానికి బాధితులు ఇళ్ల వద్దే ఉండాల్సి వస్తుందన్నారు. ఇంకా ఇళ్లు శుభ్రం చేసుకోవడం పూర్తి కాలేదని, ఇంటికి అవసరమైన సామాగ్రి, రిపేర్లు, ఇతర పనుల్లోనే నిమగ్నమై ఉన్నారని తెలిపారు. వరద బాధితులు అందరినీ ఆదుకోవాలని, కార్మికులు, చిరు ఉద్యోగులు, చిరు వ్యాపారులను ఆదుకోవడానికి ప్రభుత్వం, కార్మిక శాఖలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. భవన నిర్మాణ కార్మికులందరికీ సంక్షేమ నిధి ద్వారా కనీసం పది వేల రూపాయలు తగ్గకుండా అదనపు సహాయం అందించాలని డిమాండ్ చేశారు. లేబర్ వెల్ఫేర్ ఫండ్ ద్వారా అసంఘటిత కార్మికులను ఆదుకోవాలని, (మిగతా 2లో)

పరిహారం ఎప్పుడిస్తారు..?



ఇంటిని శుభ్రం చేస్తున్న బాధితులు

- ఆర్థిక సహాయంపై విడుదల కాని ప్రభుత్వ ఆదేశాలు
- దిక్కుతోచని స్థితిలో వరద బాధితులు
- పత్తాలేని ప్రజాప్రతినిధులు
- కొనసాగుతున్న సిపిఎం భోజన కేంద్రాలు

చేతిలో చిల్లి గవ్వ లేదు... మోటర్లు, ఫ్రిజ్‌లు ఇతర గృహోపకరణాలు, మోటార్ వాహనాలు ఎలా మరమ్మతు చేయించుకోవాలి... విధులకు ఎలా వెళ్లాలి... ఉపాధి ఎలా చూసుకోవాలి... కుటుంబాన్ని ఎలా పోషించాలి... ఇవి వరద ప్రభావిత ప్రాంతాల్లో బాధితుల నుంచి వస్తున్న ప్రశ్నలు. విజయవాడ వరద ప్రభావిత ప్రాంతాల్లో నేటికీ ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూస్తున్నారు. నష్టపరిహారంపై నేటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎటువంటి ఆదేశాలు జారీ చేయకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇన్సూరెన్స్, సహాయం, మరమ్మతు తదితర అంశాలపై ముఖ్యమంత్రి చేసిన ప్రకటనలు అమలుకు నోచుకోవడం లేదు. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం తిరిగిన ప్రజాప్రతినిధులు నేడు పత్తా లేకుండా ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరోపక్క సిపిఎం ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో నిర్విరామంగా కొనసాగుతున్న భోజన కేంద్రాల పట్ల ప్రజలు హర్షం తెలుపుతున్నారు.

విజయవాడ: గత 15 రోజులుగా బుడమేరు వరద నీటితో ఇబ్బందులు పడి ఇప్పుడిప్పుడే ముంపు నుండి బయటపడి తేరుకుంటున్న ప్రజలు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మంచినీటి మోటర్లన్నీ దెబ్బతినడంతో మరమ్మతులకు 3 వేల నుండి 5 వేల రూపాయలు వరకు ఖర్చు (మిగతా 2లో)



వాహనాలను రిపేరు చేస్తున్న మెకానిక్

నటి జత్వానీ వ్యవహారంలో

ముగ్గురు సీనియర్ ఐపిఎస్‌లపై వేటు

పిఎస్ఆర్ ఆంజనేయులు, కాంతిరాణా టాటా, విశాల్‌గున్ని సస్పెన్షన్

వార్త మెయిన్‌లో



పారదర్శకంగా ఎన్యుమరేషన్

- ఈ నెల 27 వరకు సోషల్ ఆడిట్
- కృష్ణాజిల్లా వ్యవసాయ అధికారిణి పద్మావతి

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి

భారీ వర్షాలు, కృష్ణా, బుడమేరు వరదలకు ముంపుకు గురైన పంటల నష్ట గణన (ఎన్యుమరేషన్) పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు కృష్ణాజిల్లా వ్యవసాయ అధికారి ఎన్.పద్మావతి తెలిపారు. ఈ నెల 25వ తేదీ వరకు సోషల్ ఆడిట్ నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. వర్షాలకు ముంపుకు గురై కోలుకుంటున్న పంటల్లో మేలైన ఎరువుల యాజమాన్యం, సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా మంచి దిగుబడులు సాధించవచ్చని పేర్కొన్నారు. జిల్లాలో ఖరీఫ్ పంటల సాగు, క్రాప్ కల్టివేషన్ రైట్ కార్డు (సిసిఆర్‌సి) మంజూరు, ఈ క్రాప్



నమోదు, ముంపుకు గురైన పంటల ఎన్యుమరేషన్ ప్రక్రియ గురించి 'ప్రజాశక్తి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పద్మావతి వివరించారు.

ప్రశ్న: ఖరీఫ్ పంటల ఈ క్రాప్ పూర్తయిందా?

జిల్లాలో 1,72, 435 హెక్టార్ల సాధారణ విస్తీర్ణంలో పంటలు సాగవుతాయని అంచనా వేశాం. ఈ నెల రెండో వారానికి 1,42, 844 హెక్టార్లలో వరి, 52 హెక్టార్లలో మొక్కజొన్న, 621 హెక్టార్లలో మినుము, ఒక హెక్టార్‌లో పెసర, 360 హెక్టార్లలో వేరుశనగ, 130 హెక్టార్లలో పత్తి, 1655 హెక్టార్లలో చెరకు పంట సాగయ్యాయి. మొత్తం 1,45, 704 హెక్టార్లలో పంటలు సాగయ్యాయి. ఇప్పటికి సాగయిన పంటల్లో 93 శాతం ఈ క్రాప్ నమోదు జరిగింది. ఈ నెల 23వ తేదీకి ఈ క్రాప్ నమోదు పూర్తి చేస్తాం. తర్వాత ఈ కెవైసి జరుగుతుంది.

ప్రశ్న: లక్ష్యం మేరకు కౌలు రైతులకు గుర్తింపు కార్డులు మంజూరు చేశారా?

ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పంట సాగు హక్కు ధృవీకరణ పత్రాలు(సిసిఆర్‌సి) మంజూరు చేస్తున్నాం. ఈ సీజన్‌లో 70 వేలు మందికి సిసిఆర్‌సి ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నాం. 63 వేల మందికి సిసిఆర్‌సి అందించాం. సిసిఆర్‌సి కార్డు ఉన్న కౌలు రైతులకు బ్యాంకుల (మిగతా 2లో)

మొదటిపేజీ తరువాయి

పరిహారం ఎప్పుడిస్తారు..?

చేయాల్సిన పరిస్థితి నెలకొంది. కొత్త మోటర్‌కు రూ.10 నుండి 12 వేల వరకు ఖర్చవుతుంది. ప్రభుత్వం నిర్మించిన జి ప్లస్ త్రీ ఇళ్లల్లో నగరపాలక సంస్థ మోటర్లు రిపేర్లు చేయకపోవడంతో నాలుగు అంతస్తుల పైకి నీళ్లు మోసుకుని వెళ్లాల్సి వస్తుంది. నేటికీ ఆయా ప్రాంతాల్లో మంచినీరు పూర్తిస్థాయిలో సరఫరా కావడంలేదు. ప్రభుత్వం ఇచ్చిన బియ్యం నాణ్యత లేకపోవడంతో బహిరంగ మార్కెట్లో కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం అందిస్తున్న కూరగాయలు కుళ్లిపోవడంతో పాటు ఒక్క నూనె ప్యాకెట్‌తో ఇంట్లో ఎలా వంట చేయాలని బాధితులు ప్రశ్నిస్తున్నారు. గ్యాస్ స్టవ్ మరమ్మతులు ఉచితమని చెబుతున్నా ఎక్కువ మందికి ఉచితంగా చేయడం లేదు. 300 నుండి 500 రూపాయలు ఖర్చుపెట్టి మరమ్మతు చేయించుకోవాల్సి వస్తుంది. మోటార్ సైకిల్ మరమ్మతులపై ఇన్సూరెన్స్ కంపెనీలను సంప్రదించగా మోటార్ సైకిల్ అప్పగించి రూ.8 వేలు పరిహారం తీసుకువెళ్లాలని చెబుతున్నాయి. వాహనం మరమ్మతుకు రూ.23 వేలు ఖర్చవుతుందని, రూ.8 వేలతో కొత్త ద్విచక్ర వాహనం ఎలా కొనుగోలు చేయాలని వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. ఇంట్లోని ఎలక్ట్రానిక్ వస్తువులన్నీ పాడైపోయాయని, కొత్తవి కొనలేక, పాడైపోయినవి బాగు చేయించలేక దిక్కుతోచని స్థితిలో ఉన్నామంటూ బాధితులు వాపోతున్నారు. ప్రభుత్వం పేదల కోసం నిర్మించిన అపార్ట్మెంట్లలో కింద అంతస్తులో ఉన్న వారు సర్వస్వం కోల్పోగా పైఅంతస్తులో నివసిస్తున్న వారికి 15 రోజులుగా పని లేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం ఎవరెవరికి, ఎంత ఆర్థిక సహాయం చేస్తుందో స్పష్టత లేకుండా వరద వచ్చి 15 రోజులు గడిచినా ఆర్థిక సహాయం ఇవ్వకపోతే కుటుంబాలు ఎలా గడుస్తాయంటూ వరద ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలు వాపోతున్నారు.


ఎండలో ఆరబెట్టిన చిరువ్యాపారి సామాగ్రి

ఉద్యోగ, కార్మికులను ఆదుకోండి

ప్రావిడెంట్ ఫండ్ నిధి ద్వారా రుణాలు మంజూరు చేయాలని, ఈఎస్ఐ తక్షణమే వరద ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, తాత్కాలిక ఆసుపత్రి ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ ప్రైవేటు ఉద్యోగులందరికీ 15 రోజులు పాటు వేతనంతో కూడిన సెలవు ప్రకటించాలని, ఇందుకు ప్రభుత్వం తగు జీవో ఇవ్వాలని, చిరు వ్యాపారులకు బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలు రుణమాఫీ చేసి, సబ్సిడీతో కూడిన కొత్త రుణాలు ఇవ్వాలని కోరారు. ఉపాధి కోల్పోయిన కార్మికులకు ఉపాధి చూపాలని, కేంద్ర ప్రభుత్వం ఈ శ్రమ పథకం ద్వారా కార్మికులను ఆదుకోవాలని, మరణించిన కార్మికులకు కార్మిక శాఖ రూ.25 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని, ఇంటి పని వారిని కార్మికులుగా గుర్తించి సహాయం అందించాలని, దెబ్బతిన్న ఆటోలకు పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ పర్యటనలో సిపిఎం కె.దుర్గారావు, పీరూ సాహెబ్ పాల్గొన్నారు.

పారదర్శకంగా ఎన్యుమరేషన్

ద్వారా పంట రుణాలు అందుతున్నాయి.

ప్రశ్న: భారీ వర్షాలు, వరదలకు ముంపుకు గురైన పంటల ఎన్యుమరేషన్ పూర్తయిందా?

ముంపుకు గురైన ప్రాంతాల్లో ఎన్యుమరేషన్ పారదర్శకంగా జరుగుతోంది. నష్టపోయిన పంటలు, రైతుల జాబితాలను రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచాం. ఈ నెల 27 వరకు సోషల్ ఆడిట్ పొడిగించాం. 42,916 హెక్టార్లలో వరి, 23 హెక్టార్లలో మొక్కజొన్న, 602 హెక్టార్లలో మినుము, 457 హెక్టార్లలో వేరుశనగ, 246 హెక్టార్లలో పత్తి, 277 హెక్టార్లలో చెరకు పంటలు దెబ్బతిన్నాయి. మొత్తం 44,521 హెక్టార్లలో వ్యవసాయ పంటలు రూ. 385 కోట్ల 24 లక్షలు నష్టం వాటిల్లింది.

ప్రశ్న: నీట మునిగి బయటపడిన పంటల రక్షణకు రైతులు ఎటువంటి చర్యలు తీసుకోవాలి

పిలక దశలో వరి పంట ఐదు రోజుల వరకు నీట మునిగినా తట్టుకుంటుంది. నీరు బయటకు తీసిన తర్వాత ఎకరాకు 20 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్ అదనంగా వేసుకోవాలి. బూస్టర్ డోస్ వేసుకోవడం వలన మొక్క ముంపు ప్రభావం నుంచి త్వరగా కోలుకుంటుంది. మొక్క కోలుకున్న తర్వాత కుళ్లు తెగులు రాకుండా లీటరు నీటికి ఒక గ్రాము కార్బెండజిం, లేదా రెండు గ్రాముల మ్యాంకోజెబ్ కలిసిన మిశ్రమాన్ని పిచికారీ చేయాలి.



కొనసాగుతున్న సిపిఎం భోజన కేంద్రాలు

విజయవాడ: అజిత్ సింగ్ నగర్, వాంబే కాలనీ, న్యూ రాజరాజేశ్వరి పేట, శాంతినగర్, జక్కంపూడి వైఎస్ఆర్ కాలనీ ప్రాంతాల్లో సిపిఎం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భోజన కేంద్రాలు ఆదివారమూ కొనసాగాయి. ఇళ్లు మునిగిపోయి ఇబ్బందుల్లో ఉన్న ప్రజలను ఆదుకుంటూ సిపిఎం కార్యకర్తలు తమ సేవలు అందిస్తున్నారు. భోజన పంపిణీలో వాలంటీర్లుగా పని చేస్తున్నారు. పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి బి.బలరాం, సిపిఎం నేతలు బోయి సత్యబాబు, బి రమణరావు, కే దుర్గారావు, టి ప్రవీణ్, సిహెచ్ శ్రీనివాస్, పీరూ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ దేశాల మధ్య స్నేహ సంబంధాలు ఉండాలి

ఇస్కఫ్ జాతీయ కార్యదర్శి పదిహారి

విజయవాడ: ప్రపంచ దేశాల మధ్య ఆధిపత్యం, ఆయుధ పోటీ, యుద్ధాలు నివారించి స్నేహ సంబంధాలు ఉండేలా ఐక్యరాజ్య సమితి కృషి చేయాలని భారత సాంస్కృతిక సహకార స్నేహ సంఘం (ఇస్కఫ్) జాతీయ ప్రధాన కార్యదర్శి బి.జయ్‌కుమార్ పదిహారి ఉద్ఘాటించారు. ఇస్కఫ్ రాష్ట్ర విస్తృత సమితి సమావేశం ఆదివారం నగరంలోని హనుమంతరాయ గ్రంథాలయ భవనంలో జరిగింది. తొలుత ఇటీవల మరణించిన సిపిఎం అగ్రనేత సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పదిహారి మాట్లాడుతూ పాలస్తీనా మీద ఇజ్రాయిల్, ఉక్రెయిన్ రష్యా దేశాల మధ్యన సంవత్సరాల తరబడి యుద్ధాలు జరుగుతున్నాయని, సంపద మీద ఆధిపత్యం సరిహద్దుల మీద మత విశ్వాసాల ప్రాతిపదికన జరగడం వల్ల ప్రాణ, ఆస్తి నష్టం జరుగుతుందన్నారు. దీనిని నివారించడంలో ఐరాస ప్రధాన పాత్ర పోషించాలన్నారు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఏర్పడిన ఇస్కఫ్ వివిధ దేశాల మధ్య శాంతి, స్నేహ సంబంధాలు నెలకొల్పడంలో విశేష కృషి చేస్తుందన్నారు. శాంతి ఉద్యమ నాయకులు అక్కినేని వనజ మాట్లాడుతూ మతోన్మాద ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లో బిజెపి పరిపాలన సాగిస్తుందన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాగితాల రాజశేఖర్, సనపాల నరసింహులు, అధ్యక్షులు టి.సుకుమారన్ మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో మహాసభలు జరిపి త్వరలోనే రాష్ట్ర మహాసభ నిర్వహిస్తామన్నారు. అనంతరం ఇటీవల వరదల వల్ల నష్టపోయిన ప్రజా కళాకారులు ఆర్.పిచ్చయ్యకు ఐదు వేల రూపాయలు అందజేశారు. ఇటీవల మరణించిన వియత్నాం కమ్యూనిస్టు నేత పుచ్చికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఇస్కఫ్ రాష్ట్ర కమిటీ సభ్యులు మోతుకూరి అరుణకుమార్, పరుచూరి అజయ్‌కుమార్, బుద్ధవరపు వెంకట్రావు, జెవి ప్రభాకర్, మహబూబ్ ఆజం తదితరులు పాల్గొన్నారు.



బోండా కార్యాలయం వద్ద వరద బాధితుల ఆందోళన

విజయవాడ: సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బోండా ఉమా కార్యాలయం వద్ద వరద బాధితులు ఆందోళనకు దిగారు. దాతలు ఇస్తున్న సాయాన్ని తామే పంచుతామని ఆ తరువాత వాటిని బాధితులకు ఇవ్వకుండా టిడిపి కార్యకర్తలకు, బంధువులు, స్నేహితులకే ఇస్తున్నారంటూ బోండా అనుచరులపై 62వ డివిజన్ హరిహర క్షేత్రం ప్రాంత ప్రజలు మండిపడ్డారు. బాధితులను వదిలేసి స్లిప్పులు ఇచ్చి మరీ టిడిపికి కావాల్సిన వారికి మాత్రమే పంపిణీ చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓట్లు అడగడానికి వచ్చినప్పుడు మాత్రమే మేము కనబడతామా అంటూ బాధితులు మండిపడ్డారు.

కార్మికుని మృతదేహం లభ్యం

విజయవాడ: న్యూ రాజరాజేశ్వరిపేటలో నివసిస్తున్న ముఠా కార్మికుడు కె.పోలినాయుడు ఈ నెల ఒకటో తేదీన ఇంటికి వెళుతుండగా వరద ఉధృతికి కొట్టుకుపోయారు. 15 రోజుల అనంతరం ఆదివారం మృతదేహం లభ్యమైంది. రాజీవ్ గాంధీ కూరగాయల మార్కెట్లో పోలినాయుడు హమాలీ వృత్తి చేస్తున్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీ వద్ద కార్మికుని మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ప్రభుత్వం కార్మికుని కుటుంబాన్ని ఆదుకోవాలని, రూ.25 లక్షలు ఆర్థిక సహాయం అందించాలని కోరారు. బాబూరావుతో పాటు సిఐటియు నేత కె.దుర్గారావు, సూరి తదితరులు ఉన్నారు.



'ఓపెన్ హార్ట్' సాయం

విజయవాడ: గత పది రోజులుగా ఓపెన్ హార్ట్ ట్రస్ట్ ద్వారా స్థానిక అజిత్‌సింగ్‌నగర్, రాజీవ్‌నగర్, వాంబేకాలనీ, రాజరాజేశ్వరిపేట, ఉడా కాలనీ, పైపులరోడ్డు, వడ్డెర కాలనీ తదితర ఏరియాలలో ప్రతి రోజు సుమారు ఐదు వేల మందికి ఆహార పొట్లాలు, వాటర్ బాటిల్స్, రొట్టెలు, బిస్కట్లు అందిస్తున్నట్లు ట్రస్ట్ ఫౌండర్ రాసంశెట్టి నందకిషోర్ తెలిపారు. గత ఐదు రోజులుగా వరద తగ్గుముఖం పట్టడంతో సర్వస్వం కోల్పోయిన వరద బాధితులకు ఆహారంతో పాటు దుప్పట్లు, బట్టలు, చీరలు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి ట్రస్ట్ అధ్యక్షులు తనూజారాణి, వాలంటీర్లు అందించిన సేవలు మరువలేనివని తెలిపారు.





నిత్యావసరాలు అందజేత

ప్రజాశక్తి-కంకిపాడు

తాడిగడప మున్సిపాలిటీ పోరంకి సిఐటియు ఆఫీసులో ఇటీవల వరదలో విజయవాడకండ్రిక నుండి ఇక్కడికి పనికి వచ్చే మున్సిపల్ వర్కర్స్ ఇల్లు పూర్తిగా దెబ్బతిని కట్టుబట్టలతో మిగిలిన కార్మికులకు సిఐటియు మండల కమిటీ తరపున వరద బాధితులకు నిత్యవసర వస్తువులు, వంట పాత్రలు, బట్టలు అందించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తులు మాట్లాడుతూ ఇలాంటి పరిస్థితుల్లో కార్మికుల్ని కాపాడుకోవడంలో సిఐటియు అన్ని సందర్భాల్లో ముందు ఉంటదదన్నారు. అలాగే కరోనా సమయంలో కూడా కార్మికులకు నిరంతరం నిత్యవసర వస్తువులు భోజనం ప్యాకెట్లు మందులు సిఐటియు ఆధ్వర్యంలో అందించామన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా మహిళా సంఘం పెనమలూరు మండలం కార్యదర్శి పుసులూరి పాతాళ లక్ష్మి, వైసరళ, తాడిగడప మున్సిపాలిటీ సిఐటియు అధ్యక్షులు. బుజ్జులు, విజయ, పుసులూరి సత్యనారాయణ, ప్రజానాట్యమండలి నాయకులు గుంజి నరసయ్య, ఉప్పాడ ఈశ్వరి, సురేష్ పాల్గొన్నారు.

అన్నదాతకు అపార నష్టం

- వరదలకు కుళ్లిపోయిన పంటలు
- దిక్కుతోచని స్థితిలో రైతాంగం

ప్రజాశక్తి-గన్నవరం: వరదలకు పంటలన్నీ నాశనం అవడంతో అన్నదాతకు కన్నీరే మిగిలింది. బుడమేరంత దుఃఖ సాగరంలో మునిగిపోయారు. కౌలు రైతుకు అపార నష్టం వాటిల్లింది. మరో 60 రోజుల్లో పంట చేతికి వస్తుందన్న సంతోషం భారీ వర్షాలకు కొట్టుకుపోయింది. ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో రైతులు, కౌలు రైతులున్నారు. ఎకరానికి రూ.20వేల వరకూ పెట్టుబడి పెట్టారు. వరితో పాటు పత్తి, వేరుశనగ, చెరుకు, కూరగాయ పంటలు భారీగా దెబ్బతిన్నాయి. రోజుల తరబడి వరద నీరు నిలిచి ఉండటంతో పంట అంతా కుళ్లి పోయింది. నియోజకవ ర్గంలో గన్నవరం, బాపులపాడు, ఉంగుటూరు, విజయవాడ రూరల్లోని పలు గ్రామాల్లో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. మండలంలో ముస్తాబాద పేడ చెరువు కింద 2,300 ఎకరాలు పూర్తిగా పంటపోగా 500 ఎకరాల్లో పాక్షికంగా దెబ్బతింది. సావరగూడెం, కేసరపల్లి, పురుషోత్తపట్నం గ్రామాల్లో ఎక్కువ పంట నష్టం జరిగిం ది. ఈ ఒక్క గ్రామంలో వందల ఎకరాల పంట వరద పాలైంది. మండలంలో వరి 2421.69 హెక్టార్లు, పత్తి 219.91 హెక్టార్లు, వేరుశనగ 29.72 హెక్టార్, చెరకు 11.31 హెక్టార్లలో పంట నష్టం జరిగింది. ప్రభుత్వం అపరాలు ఇచ్చి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.





దుఃఖ సాగరంలో రైతన్నలు.. రవి,

అంతా అప్పే. మరో 60 రోజుల్లో కోతకోయటమే అనుకున్నా. ఇంతలోనే భారీ వర్షాలు, వరద వచ్చింది. ఇలాంటి వరద ఎన్నడూ చూడలేదు. బుడమేరు దెబ్బకు పంట మొత్తం కొట్టుకుపోయింది. పశుగ్రాసం లేదు. ప్రభుత్వమే రైతులను ఆదుకోవాలి.



70 ఎకరాలు పంట నష్టం..నాగేశ్వరరావు అట్లా,

70 ఎకరాలు కౌలు చేస్తున్నా. 40 ఎకరాల పంట వరదపాలైంది. ఇప్పటి వరకూ రూ.11.30 లక్షలు పెట్టుబడి పెట్టా. నిండా మునిగిపోయాం. ప్రభుత్వం ఆదుకుంటేనే చేసిన అప్పులు తీరతాయి. ముఖ్యంగా బ్యాంకు రుణాలు రద్దు చేయాలి.

మతోన్మాదంపై 'ఏచూరి' రాజీలేని పోరాటం

- సంస్మరణ సభలో వక్తలు

ప్రజాశక్తి-గన్నవరం : భారత ఎర్ర జెండా ఉద్యమ ముద్దుబిడ్డ, మార్క్సిజాన్ని భారతీయ పరిస్థితులకు వర్తింపజేసి విప్లవ శక్తులను కొత్త పుంతలు తొక్కించడానికి విరామ మెరుగక కృషిచేసిన నిత్య శ్రామికుడు సిపిఎంజాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అని పలువురు పెద్దలు కొనియాడారు. గన్నవరం మండలం సిపిఎం ఆధ్వర్యంలో ఆదివారం సిపిఎం కార్యాలయంలో సీతారాం ఏచూరి సంస్మరణ కార్యక్రమం జరిగింది. అయన చిత్రపటానికి సీపీయం నాయకులు కె. వెంకటేశ్వరావు, అనుమోలు వెంకటేశ్వరావు పూల మాలలు వేసి నివాళులర్పించారు. సిపిఎం మండల కార్యదర్శి మల్లంపల్లి అంజనేయులు అధ్యక్షత వహించారు. ఆర్థిక విశ్లేషకులు గన్నె వెంకట్రావు మాట్లాడుతూ సామ్రాజ్యవాదం మతోన్మాదంపై రాజీలేని యుద్ధం చేసిన పోరాటయోధుడు విశ్రమించాడన్నారు. సీతారాం ఏచూరి మూడు దశాబ్దాలుగా భారతదేశ వ్యాప్తంగా ఎన్నో పోరాటాలకు ఊపిరి పోశారని తెలిపారు. దేశంలోని అన్ని పార్టీల నేతలు కొనియాడిన గొప్ప నేత అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సామాజిక సేవకులు డా.మద్దూకూరి విజయకుమార్ మాట్లాడుతూ తాను పుట్టుక రీత్యా కమ్యూనిస్టుని అన్నారు. బుద్ధవరం సర్పంచ్ బడుగు బాలమ్మ, పార్టీ నాయకులు అనుమోలు వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

ఏచూరి మరణం తీరని లోటు

సిపిఎం జిల్లా ప్రధాన కార్యదర్శి వై నరసింహారావు

ప్రజాశక్తి - గుడివాడ : సీతారాం ఏచూరి మరణం దేశ రాజకీయాలకు తీరని లోటని సిపిఎం జిల్లా ప్రధాన కార్యదర్శి వై నరసింహారావు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి సంస్మరణ సభ జరిగింది. తొలుత ఏచూరి చిత్రపటానికి సీనియర్ జర్నలిస్ట్ రాధాకష్ణ పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వై నరసింహారావు మాట్లాడుతూ ఏచూరి మరణం దేశ రాజకీయాలలోనే తీరని లోటు అన్నారు. విద్యార్థి ఉద్యమాలైన ఎస్ఎఫ్ఐ లో పనిచేసే సమయంలో దగ్గరగా పనిచేసిన అనుభవం ఉందన్నారు. తన చివరి శ్వాస వరకు పేద ప్రజల కోసం పాటు పడిన వారిలో ఏచూరి ఒకరన్నారు. ఈ కార్యక్రమానికి సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి ఆర్‌సిపి రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు నీలం మురళీకష్ణ రెడ్డి, విశ్రాంత లెక్చరర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-ఉంగుటూరు :** మండలంలోని పలు చోట్ల సీతారాం ఏచూరి చిత్రపటానికి సిపిఎం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆత్కూరులో అన్నే రామారావు స్థూపం వద్ద, కొయ్యగూరపాడు సిపిఎం స్థూపం వద్ద సీతారాం చిత్రపటాలకు నివాళులర్పించారు. మండల పార్టీ కార్యదర్శి అజ్మీరా వెంకటేశ్వరరావు, మండల పార్టీ నాయకులు కడవకొల్లు రామరాజు, వెంకటరత్నం, రాఘవులు, ప్రసాద్, బాబూరావు పాల్గొన్నారు. **పామర్రు :** ఏచూరి సంస్మరణ సభ పామర్రు సిపిఎం కార్యాలయంలో కన్వీనర్ ఓ గంగాధర్ ప్రసాద్ అధ్యక్షతన ఆదివారం జరిగింది. ముఖ్య అతిథిగా పార్టీ జిల్లా కమిటీ సభ్యులు మాదల వెంకటేశ్వరావు హాజరై మాట్లాడారు. ఏచూరి అలుపెరుగని పోరాటయోధుడని, విద్యార్థి పోరాటాలతో ప్రారంభమైన ఆయన ప్రయాణం దేశవ్యాప్తంగా ఎన్నో పోరాటాలకు ఊపిరి పోసారన్నారు. శీలం నారాయణరావు,విల్సన్, పెదబాబు, ఇంటి రాజు, యార్లగడ్డ శ్రీనివాసరావు, కె నాగభూషణం, మన్నే శ్రీనివాసరావు, ప్రజానాట్యమండలి కళాకారులు ఆదిశేషు. రామస్వామి పాల్గొన్నారు.

అన్నసమారాధన

ప్రజాశక్తి ఘంటసాల : ఘంటసాల మండలం శ్రీకాకుళం గ్రామంలో కరకట్టపై వినయకుడి అలయమందు గణేష్ ఉత్సవ కమిటీ వారు ఏర్పాటు చేసిన అన్నసంతర్పణ కార్యక్రమాన్ని నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్రామ్ (రాజా) ఆదివారం ప్రారంభించారు. గణనాథుని ఉత్సవ మూర్తిని నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్రామ్, ఘంటసాల యస్ఐ ప్రతాప్ రెడ్డి దర్శించుకుని పూజలు చేశారు.

కుర్చీ బహూకరణ

ప్రజాశక్తి-పెదపారుపూడి : రక్షణ సైన్యం దేవాలయానికి అదే గ్రామానికి చెందిన సంఘ సభ్యులు చొక్కా కొర్నలు, ఎస్తేరు దంపతులు సుమారు 15 వేల రూపాయలు తమ సొంత నిధులు వెచ్చించి కుషన్ చైర్స్‌ను ఆ సంఘ కాపరి మేజర్ విజయ్ కుమార్, మేజర్ లూర్దు కుమారి ల చేతుల మీదుగా అందించారు. సంఘ పెద్దలు దగాని జోసెఫ్, నత్త భూషణ కుమార్, గూడపాటి భాస్కరరావు, గహ సమితి సభ్యులు పీక పద్మ, గుమ్మడి యేసు మరియమ్మ పాల్గొన్నారు.

నిమజ్జన ప్రాంతాలు పరిశీలన



నిమజ్జన ప్రాంతాల్లో సూచనలిస్తున్న ఎస్‌పి గంగాధరరావు

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : గణేష్ నిమజ్జనం పురస్కరించుకుని ఊరేగింపు మార్గాలు, నిమజ్జన ఘాట్ ప్రాంతాలను జిల్లా ఎస్పీ ఆర్ గంగాధర రావు ఆదివారం ప్రత్యక్షంగా పరిశీలించారు. మచిలీపట్నంలోని మంగినపూడి బీచ్ వద్ద, కాలేఖాన్ పేట మంచినీళ్ల కాలువ, పెడన, గూడూరు అడ్డరోడ్డు వద్ద గల గణేష్ నిమజ్జనం చేసే ప్రాంతాన్ని పోలీస్ అధికారులతో కలిసి ప్రత్యక్షంగా పరిశీలించారు. నిమర్జనం ప్రాంతాల్లో ప్రమాదాలకు తావు లేకుండా పోలీసు వారు ముందస్తుగా తీసుకున్న ఏర్పాట్లన్నిటిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎలాంటి ప్రమాదాలకు, అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం లేకుండా నిమర్జనంలో పాల్గొనే వారు కూడా లైఫ్ జాకెట్లు ధరించాలని సూచించారు. ప్రతిక్షణం అప్రమత్తంగా ఉంటూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు, గొడవలకు, ప్రమాదాలకు ఆస్కారం లేకుండా పటిష్ట బందోబస్తు నిర్వహించాలని, నిమజ్జనం చేసే ప్రాంతాలలో మెరైన్ పోలీస్ మరియు ఫిషరీస్ డిపార్ట్మెంట్ వారిని సమన్వయం చేసుకుంటూ, గజ ఈతగాళ్లను, లైఫ్ జాకెట్లను ధరించిన సిబ్బందిని నిరంతరం సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. రూట్ బందోబస్తు నిర్వహించే సిబ్బంది కచ్చితంగా యాంటీ రాయిట్ గేర్ ధరించి బందోబస్తు నిర్వహించాలని తెలిపారు. అదేవిధంగా మద్యం సేవించిన వారిని, చిన్నారులను నిమజ్జనం చేసే సమయంలో లోపలికి అనుమతించకుండా చూడాలని, నిమజ్జనం చేసే భక్తులకు కూడా లైఫ్ జాకెట్లు ధరించి లోపలికి దిగాలని ఆదేశించారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి-మొవ్వ : మొవ్వ మండలం కోసూరు, గ్రామ ఏరియాలో భారీ వర్షాలకు నీట మునిగి దెబ్బతిని బయటపడిన వరి పొలాలను ఆదివారం ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శీలం నారాయణరావు పరిశీలించారు. తుఫాను వలన దెబ్బతిన్న రైతాంగాన్ని ఆదుకొని నష్టపరిహారం చెల్లించాలని, కౌలు రైతులకు పూర్తిస్థాయిలో పంట నష్టపరిహారాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. **ప్రజాశక్తి-బంటుమిల్లి :** భారీ వర్షాలకు పాడైన వరి పొలాలకు నష్టపరిహారం ఎకరాకు పదివేలు ప్రకటించడం విచారకరమని, ప్రభుత్వం పూర్తిగా దెబ్బతిన్న వరి పొలాలకు కనీసం 20 వేల రూపాయలు, పాక్షికంగా దెబ్బతిన్న పొలాలకు పదివేల రూపాయలు ఎకరానికి ఇవ్వాలని రైతు సంఘం కష్ణా జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు.బంటుమిల్లిలో స్థానిక గుండా బత్తుల ఆంజనేయులు భవనంలో రైతు సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ముందుగా సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నాయకులు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలకు నష్టపోయిన వాణిజ్య పంటలకు ఎకరానికి 75 వేల రూపాయలు ప్రకటించాలని, ఈక్రాప్, కెవైసితో తప్పనిసరి ప్ర మేయం లేకుండా రైతులకు, కౌలు రైతులకు ప్రభుత్వ సహాయం సత్వరమే అందించాలని డిమాండ్ చేశారు. బంటుమిల్లి మండల రైతు సంఘం కార్యదర్శి లంకదాసుల అజయ్ ఘోష్, రైతు సంఘం సీనియర్ నాయకులు సుజ్ఞానం జనార్ధన్ రావు, గౌరిశెట్టి నారాయణరావు, గౌరిశెట్టి వీరబాబు, పుప్పాల నరసింహారావు పాల్గొన్నారు.**ప్రజాశక్తి-చల్లపల్లి :** వరదలో నష్టపోయిన లంక భూముల రైతులకు న్యాయం చేయాలని ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పంచకర్ల రంగారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల పరిధిలోని వెలివోలు లో కృష్ణానది వరద ఉధతికి పంట నష్టపోయిన రైతులను ఆదివారం పరామర్శించారు. వంట నష్టాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చీడేపూడి లంక భూమిలో నష్టపోయిన పంటలను ఈ కేవైసీ తో సంబంధం లేకుండా ఈ క్రాఫ్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇటీవల కష్ణా నది వరద ఉధతికి లంక భూముల రైతులు తీవ్రంగా నష్టం పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. చీడేపూడి లంకలో కంద, పసుపు, కూరగాయల పంటలు తదితర వాణిజ్య పంటలు నీటిలో మునగటంతో పూర్తిగా నష్టపోయారని అన్నారు. రాయితీపై ఎరువులు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు యద్దనపూడి మధు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మహమ్మద్ కరీముల్లా, రైతులు పెనుముచ్చ ప్రభాకర్ రావు, కొడాలి వెంకటేశ్వరరావు, కోనేరు శ్రీనివాసరావు, కొలవెంటి రాజారావు, కుంపటి ఆశీర్వాదం, ఈ పూరి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.



బంటుమిల్లి మండలంలో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

నూతన బస్సు సర్వీసులు ప్రారంభం

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ ఆర్టీసీ డిపో నుండి రాష్ట్ర రాజధానికి బస్సు నడపాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి ఆర్టీసీ యాజమాన్యానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆర్టీసీ డిపోలో రెండు కొత్త నూతన బస్ సర్వీసులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమాన్ని ఉద్దేశించి బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ అవనిగడ్డ డిపోకు ఇప్పటికి 8 కొత్త బస్ సర్వీసులను ప్రారంభించామన్నారు. బిహెచ్ఇఎల్ కు రెండు ఈసీఎల్ కు రెండు సూపర్ లగ్జరీ బస్సులు, విజయవాడకు రెండు ఎక్స్‌ప్రెస్ బస్సులు, తాజాగా రెండు పల్లెలకు బస్సులను ప్రభుత్వం కేటాయించినట్లు తెలిపారు. నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్ రామ్, ఎంపీపీ తుంగల సుమతీ దేవి, డిపో మేనేజర్ కె హనుమంతరావు, అసిస్టెంట్ మేనేజర్ సిహెచ్ శ్రీలక్ష్మి పాల్గొన్నారు

రేపు నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ

ప్రజాశక్తి-పెదపారుపూడి : ఈనెల 17వ తేదీన జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మండలంలోని మూడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో వైద్య సిబ్బంది నులుపురుగుల నివారణకు "ఆల్బెండజోల్ "టాబ్లెట్లను విధిగా పంపిణీ చేస్తారని వెంట్రప్రగడ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు డాక్టర్ సందీప్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ గీతాబాయి ఆదేశాల మేరకు మండలంలోని ప్రతి ఆరోగ్య కేంద్రాలలో, ప్రతి పాఠశాలలో ప్రతి అంగన్వాడి కేంద్రాలలో అందుబాటులో ఉంటారని అన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు : ఎంఎల్ఎ

ప్రజాశక్తి-గన్నవరం : ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దానిలో భాగంగా ప్రతి మంగళవారం, శుక్రవారం గన్నవరం క్యాంప్ కార్యాలయంలో మద్యాహ్నం 2 గంటల నుండి రాత్రి 9గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజలకు అందుబాటులో ఉంటామని పేర్కొన్నారు. అలాగే బుధ, గురు వారాల్లో విజయవాడ కార్యాలయంలో సాయంత్రం 4 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు ప్రజలకు అందుబాటులో ఉండి నియోజకవర్గ ప్రజలు ఎదుర్కోంటున్న సమస్యలను "నేరుగా తెలుసుకుంటామని తెలిపారు. ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది 10 మందికి పైగా వారంలో ఏడురోజులు ఉదయం 9 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు ప్రజల సమస్యల పరిష్కారం కొరకు అందుబాటులో ఉంటారని వివరించారు. గన్నవరం నియోజకవర్గ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొవాలని కోరారు.

'విక్కుర్తి' ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డలోని పలు గణేష్ మండపాలలో పారిశ్రామికవేత్త విక్కు ర్తి శ్రీనివాస్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపతి నవరాత్రి మండపాలకు ఆదివారం వెళ్లి వెళ్లి అభిమానులతో కలిసి పూజలు నిర్వహించారు, అవనిగడ్డ ఒకటో వార్డు గుర్రపు చెరువు గాడ్స్ హై స్కూల్ మండలిపురంలోని గణపతి మండపాలకు వెళ్లి పూజలు నిర్వహించి యువకులతో కలిసి నిమజ్జనోత్సవం లో పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న విక్కుర్తి శ్రీనివాస్

రూ.71 వేలకు లడ్డూ వేలం



ప్రజాశక్తి - భవానీపురం : విద్యాధరపురం చెరువు సెంటర్ ప్రాంతంలో ఏర్పాటుచేసిన చవితి వినాయక లడ్డూను వేలం పాట ఆదివారం నిర్వహించారు. రూ.71 వేలకు లడ్డూ పాటలో న్యాయవాది షేక్ అన్వర్ మైనార్టీ అయినప్పటికీ మత సామరస్యానికి అతీతంగా వినాయక చవితి లడ్డూ వేలం పాటలో పాల్గొని లడ్డూను దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మాజీ కార్పొరేటర్ వెణుతురమిల్లి హరినాథ్ స్వామి, స్థానిక పెద్దలు, యువత పెద్ద ఎత్తున చవితి ఉత్సవాల్లో పాల్గొని స్వామివారికి పూజల్లో నిర్వహించారు.

ఏచూరికి ఘన నివాళి

ప్రజాశక్తి - వత్సవాయి : స్థానిక సిపిఎం కార్యాలయంలో ఆదివారం సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి ఘన నివాళు లర్పించారు. నాయకులు బి.రాము అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి తమ్మినేని రమేష్ ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. సిపిఎం సీనియర్ నాయకులు చిరుమామిళ్ల హనుమంతరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గంగుల వెంకటేశ్వర్లు, పెంటి వెంకయ్య, కూరపాటి వెంకటి పెంటి కోటేశ్వరావు, ఏసుపోగు వెంకటరత్నం, న్యాయవాది కరిసే రత్నబాబు తదితరులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు.

ఇబ్రహీంపట్నం : విజయవాడ రూరల్ గొల్లపూడిలో బంక్ సెంటర్‌లో సిపిఎం కమిటీ ఆధ్వర్యంలో సిపిఐ (ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి నివాళి అర్పించారు. ఏచూరి చిత్రపటానికి పూలమాలలు శాఖా కార్యదర్శి అసుర శ్రీకాంత్ నివాళు లర్పించారు. సిపిఎం జిల్లా సెక్రటేరియట్ సభ్యులు కోట కళ్యాణ్, మండల కార్యదర్శి తాళ్లూరి నరసింహారావు, నాయకులు, ప్రముఖ న్యాయవాది ఆవుల వెంకటరామయ్య పాల్గొన్నారు.



భోజనం వడ్డిస్తున్న సిఐ డి.చవాన్

అన్నదానం

ప్రజాశక్తి - కంచికచర్ల : గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పందిల్ల వద్ద అన్నదానం చేయటం అభినందనీయమని నందిగామ రూరల్ సిఐ డి.చవాన్ అన్నారు. గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా స్థానిక బంకు సెంటర్‌లో బాల వినాయకుని కమిటీ, శివ కల్యాణి ట్రాన్స్‌పోర్టు నిర్వాహకులు అనుమాల వాసు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపంలో సొసైటీ మాజీ అధ్యక్షుడు ధమ్మాలపాటి కోటిబాబు ఏర్పాటు చేసిన అన్నదానం సిఐ చవాన్ ప్రారంభించారు.

సిపిఎం నాయకుడు కృష్ణకు నివాళి



ప్రజాశక్తి - తిరువూరు : సిపిఎం చీరాల సెంటర్ శాఖ సీనియర్ సభ్యులు పిల్లల కృష్ణ(68) మృతి చెందారు. నాలుగు రోజుల నుండి తీవ్ర జ్వరంతో బాధ పడుతున్న ఆయన్ను కుటుంబ సభ్యులు చిన్నవుటుపల్లి ఆసుపత్రిలో చికిత్స చేయిస్తుండగా ఆదివారం మృతి చెందారు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. 40 సంవత్సరాల నుండి సిపిఎం సభ్యుడిగా కొనసాగుతూ పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్న కృష్ణ మృతి పార్టీకి, ప్రజాతంత్ర ఉద్యమానికి తీవ్ర లోటని సిపిఎం జిల్లా కార్యదర్శి డివి.కృష్ణ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మేకల నాగేంద్ర ప్రసాద్ అన్నారు. సీనియర్ నాయకులు గుళ్లపల్లి వెంకటరత్నం, నూకల సత్యనారాయణ, పంతంగి శ్రీనివాసరావు, బి.వెంకటేశ్వరరావు తదితర పార్టీ సభ్యులు కృష్ణ మృతదేహాన్ని సందర్శించి పార్టీ జెండా కప్పి, పూలమాలేసి ఘనంగా నివాళులర్పించారు.

డంపింగ్ యార్డును తలపిస్తున్న చర్చి సెంటర్



చర్చి సెంటర్‌లో చెత్తను డంప్ చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - భవానీపురం : భవానీపురం బైపాస్ రోడ్డు చర్చి సెంటర్ ప్రాంతం చెత్త డంపింగ్ యార్డ్‌గా మారిపోయింది. దీంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నామని వాపోతున్నారు. వివరాల్లోకి వెళ్తే వరదల నేపథ్యంలో భవానీపురం ఆర్టీసీ వర్కుషాపు రోడ్డు, ఊర్మిళానగర్, చర్చి సెంటర్, కబేళా ప్రాంతాల్లోని నివాసాలు వరద నీటిలో మునిగిపోయాయి. దీంతో ఇళ్ళల్లోకి సుమారు 7 నుంచి 8 అడుగుల వరద నీరు రావటంతో ఇళ్ళల్లోని గృహోపకరణాలైన డబుల్‌కాట్ మంచాలు, పరుపులు, దిండ్లు, దుస్తులు, ఫ్రిజ్‌లు, వాషింగ్ మెషీన్లు ఇతర సామాగ్రి మొత్తం పనికి రాకుండా పోవటంతో రోడ్లపై వరద బాధితులు రోడ్లపై పడవేయటంతో సంబంధి శానిటరీ అధికారులు బైపాస్ రోడ్డులోని భవానీపురం చర్చి ఎదుట లారీల కొద్దీ చెత్తను తరలిస్తూ అక్కడ డంప్ చేస్తున్నారు. దీంతో వక పక్క దుర్వాసనకు తోడు నిత్యం భాగా వాహనాల రద్దీగా ఉండే చర్చి సెంటర్ ప్రాంతంలో వాహనదారులు పలు ఇక్కట్లకు గురవుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనన్న భయాందోళనలో ద్విచక్ర వాహనదారులు, ఆటోవాలాలు ఆందోళన చెందుతున్నారు. ఎక్కడెక్కడి నుంచో చెత్తను లారీలతో తరలించి ఇక్కడకు తీసుకువచ్చి పడవేయటంపై ప్రజలు, వాహనదారులు మండిపడుతున్నారు. మరోపక్క ఆదివారం చర్చి సెంటర్‌లో చెత్త లారీలు డంప్ అవుతుంటే దానికి ఎదురుగా రోడ్డుపై ద్విచక్ర వాహనాల మెకానిక్‌లు క్యాంపైన్ పెట్టి వాహనాలకు మరమ్మతులు చేపట్టారు. దీంతో చర్చి సెంటర్ ప్రాంతం ట్రాఫిక్ కోరల్లో చిక్కుకుంది. ఇంత దారుణంగా ఉన్నా కనీసం ఆ ప్రాంతంలో కనీసం ఒక్క ట్రాఫిక్ కానిస్టేబుల్ కూడా కనిపించని పరిస్థితి. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిద్దామనే ధ్యాస సంబంధిత అధికారులకు లేకపోవటంపై వాహనదారులు, ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు. ఇప్పటికైనా ఆ ప్రాంతంలో చెత్త డంపింగ్‌ను నివారించి, వాహనదారుల ఇబ్బందులు తొలగించాలని కోరుతున్నారు.

యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఆటల పోటీలు



కేరమ్స్ ఆడుతున్న మహిళలు

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : యుటిఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం పడమట బాలుర హైస్కూల్‌లో జిల్లాలోని టీచర్స్‌కి ఆటల పోటీలు జరిగాయి. ఈ కార్యక్రమంలో పాల్గొని ఆటలు పోటీలు ప్రారంభించిన రాష్ట్ర అధ్యక్షులు నక్క వెంకటేశ్వర్లు మాట్లాడుతూ యుటిఎఫ్ 50 సంవత్సరాల సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో ఆటలు పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. విజేతలందరూ అక్టోబర్లో రాష్ట్రస్థాయిలో గుంటూరులో జరిగే పోటీలలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. యుటిఎఫ్ విద్యారంగ సమస్యలతో పాటు కరోనా సమయంలో సేవా కార్యక్రమాలు, బుడమేరు వరద బాధితుల సహాయార్థం సేవా కార్యక్రమాలు వంటి చేస్తూ సామాజిక స్పృహ గల సంఘంగా నిలబడి, అగ్రగామి సంఘంగా నిలబడిందని తెలిపారు. రాష్ట్ర కార్యదర్శి ఎస్పీ మనోహర్ కుమార్ రన్నింగ్ పోటీలను , షాట్ పుట్ పోటీలు ప్రారంభించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సుందరయ్య మాట్లాడుతూ యుటిఎఫ్ ఆవిర్భవించి 50 సంవత్సరాలు అయిన సందర్భంగా రాష్ట్ర స్థాయిలో స్వర్ణోత్సవ పండుగ సందర్భంగా ఈ క్రీడలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రన్నింగ్ , షటిల్, సింగల్, డబుల్, క్రికెట్, వాలీబాల్, షార్ట్ పుట్, చెస్, కేరమ్స్ తదితర క్రీడల్లో పురుషులకు మహిళలకు విడివిడిగా నిర్వహించినట్లు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు క్రికెట్, క్యారమ్స్ షటిల్ పోటీలు ప్రారంభించారు. జిల్లా సహాధ్యక్షుడు ఎం.కృష్ణయ్య రన్నింగ్ 200 మీటర్స్ పోటీలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, ఎ.సుందరయ్య జిల్లా సహాధ్యక్షుడు కృష్ణయ్య, జిల్లా కోశాధికారి పి.నాగేశ్వరరావు, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ కన్వీనర్ ఏ.గోపాలకృష్ణ, జిల్లా కార్యదర్శి బి రెడ్డి స్టార్, బి.రమణయ్య, జిల్లా ఆడిట్ సభ్యుడు ఎల్.చంటి, ఎ.రామకృష్ణ వివిధ మండలాల నాయకులు పాల్గొన్నారు.

ప్రముఖ వ్యాపారవేత్త నాగుబండి మృతి



ప్రజాశక్తి - తిరువూరు : వ్యాపార దిగ్గజం, తిరువూరు పట్టణ ఆర్యవైశ్య ప్రము ఖులు నాగుబండి రామారావు(86) వయోభారంతో శనివారం రాత్రి తిరువూరు బోసుబొమ్మ సెంటర్‌లోని తన నివాసంలో కన్నుమూశారు. ఆయనకు భార్య, కుమారులు శ్యాంసుందరరావు, విశేశ్వరరావులతో పాటు ఒక కుమార్తె ఉన్నారు. సుమారు 60 సంవత్సరాలుగా ఎరువులు, పురుగు మందుల ప్రముఖ వ్యాపార వేత్తగా నియోజకవర్గంలోనే కాకుండా తెలంగాణా ప్రాంతంలో కూడా పేరు తెచ్చుకున్న ఆయన వ్యాపారానికి విరామం తీసుకుని కొడుకులకు అప్పగించారు. ఆయన గతంలో చీరాల సెంటర్లోని వీరాంజనేయ స్వామి దేవాలయానికి, ఆర్యవైశ్య సంఘం చైర్మన్‌గా కూడా కొనసాగారు. వైసిపి తిరువూరు నియోజకవర్గ ఇంచార్జ్, మాజీ ఎంఎల్ఎ నల్లగట్ల స్వామిదాస్, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ నల్లగట్ల సుధారాణి, దుర్గామల్లే శ్వరస్వామి దేవస్థానం మాజీ డైరెక్టర్ దేవిశెట్టి బాలకృష్ణ, వైసిపి జిల్లా బిసి సెల్ నాయకులు కాలసాని గోపాలనాగేశ్వరావు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మేకల నాగేంద్రప్రసాద్, సీనియర్ నాయకులు, లయన్స్ క్లబ్ నాయకులు, ఆర్యవైశ్య ప్రముఖులు, గోల్డ్ మర్చంట్ రాష్ట్ర నాయకులు మృతదేహాన్ని సందర్శించారు. సిపిఎం రాష్ట్ర సీనియర్ నాయకులు బిఆర్.తులసీరావు సోషల్ మీడియా ద్వారా ప్రగాఢ సానుభూతి తెలిపారు. లయన్స్ క్లబ్ ఆఫ్ తిరువూరు ఆధ్వర్యంలో ఖమ్మం నేత్ర నిధి ద్వారా ఎల్.వి. ప్రసాద్ కంటి ఆసుపత్రి వైద్యులు రామారావు నేత్రాలను సేకరించారు. కుమారులు ప్రకాశరావు, శ్యాంసుందరరావు, విశ్వేశ్వరరావు తండ్రి నేత్రాలు దానం చేసేందుకు అంగీకరించడం అభినందనీ యమని లైన్స్ క్లబ్ నేతలు పేర్కొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు నిత్యావసరాలు పంపిణీ



శానిటరీ కార్మికులకు చీర, నిత్యావసర కిట్‌లను అందిస్తున్న యేదుపాటి రామయ్య, బ్రహ్మారెడ్డి

ప్రజాశక్తి - భవానీపురం : బుడమేరు ముంపు ప్రాంతాల్లో శానిటరీ కార్మికులు చేసిన సేవలు అభినందనీయమని మాజీ కార్పొరేటర్, 42వ డివిజన్ టిడిపి నాయకులు యేదుపాటి రామయ్య అన్నారు. 42వ డివిజన్ భవానీపురం ప్రజలకు ఎనలేని సేవలు చేసిన శానిటేషన్ సిబ్బందికి నిత్యావసర సరుకులతో పాటు చీరలను మాజీ కార్పొరేటర్ యేదుపాటి రామయ్య ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రామయ్య మాట్లాడుతూ ప్రజలలో ఉండి ఎనలేని సేవలు చేసినటువంటి శానిటేషన్ సిబ్బందిని ప్రతి ఒక్కరూ అభినందించాలన్నారు. ఈ కార్యక్రమంలో 42వ డివిజన్ శానిటరీ ఇన్స్‌పెక్టర్ బ్రహ్మారెడ్డి, టిడిపి నాయకులు నెలకుర్తి వెంకట్రావు , కోనపరెడ్డి నాగభూషణం,రామారావు, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.



వేగంగా జరుగుతున్న క్యూ లైన్ల నిర్మాణ పనులు

దసరా ఏర్పాట్లు ముమ్మరం

ప్రజాశక్తి, వన్‌టౌన్ : శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి దేవస్థానం నందు అక్టోబర్ 3వ తేదీ నుండి 12వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్న దసరా మహోత్సవాల సందర్భంగా ఆలయ అధికారులు ఏర్పట్లను ముమ్మరం చేశారు. ఈ నేపథ్యంలో ఆదివారం దుర్గగుడి దేవాలయానికి రంగులు వేస్తున్నారు. ఇప్పటికే క్యూ లైన్ల నిర్మాణం పనులు వేగంగా జరుగుతున్నాయి.

విజయవాడ వెస్ట్ ఎసిపిగా దుర్గారావు



ప్రజాశక్తి - వన్‌టౌన్ : విజయవాడ పశ్చిమ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏసిపి)గా ఎన్ఎస్‌వికె దుర్గారావు నియమితులయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం విడుదల చేసిన బదిలీల నేపథ్యంలో నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖర్ బాబు ఆదేశాల మేరకు వెస్ట్ ఏసిపిగా దుర్గారావును నియమితుల య్యారు. గతంలో దుర్గారావు కొత్తపేట స్టేషన్ సిఐగా పనిచేశారు. అలాగే ట్రాఫిక్‌లోను బాధ్యతలు నిర్వర్తించారు. ఆ తదుపరి ప్రమోషన్‌పై ఇంటిలిజెన్స్‌లో కూడా ఆయన పనిచేసిన అనుభవం ఉంది. త్వరలో విజయవాడ ఏసిపిగా దుర్గారావు బాధ్యతలు స్వీకరించనున్నారు.

పశుగ్రాసం పంపిణీకి చర్యలు

ప్రజాశక్తి - నందిగామ : నందిగామలో పశువుల రైతులకు పశుగ్రాసం వచ్చేలా చర్యలు నందిగామ పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డా. జి. వెంగళరావు తెలిపారు. పశుగ్రాసం కొరత అనే శీర్షికన ప్రజాశక్తిలో ప్రచురణ వార్త కు నందిగామ పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డా. జి. వెంగళరావు స్పందించారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.


ఆర్థికసాయం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : ఇటీవల వరదలు సంభవించడంతో ఊర్మిళానగర్ 43వ డివిజన్ టిడిపి అధ్యక్షుడు కొనికి కొండయ్య ఆటో వరద నీటిలో మునిగిపోయింది. ఈ నేపథ్యంలో ఆటో రిపేరు నిమిత్తం టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఉత్తరాంధ్ర ఇన్చార్జ్, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న సతీమణి భూలక్ష్మి, పశ్చిమ నియోజకవర్గం టిఎస్‌టియుసి గౌరవాధ్యక్షులు కాండ్రేగుల రవీంద్ర చేతుల మీదగా ఆదివారం బుద్దా వెంకన్న పార్టీ కార్యాలయంలో రూ.20 వేలు ఆర్థిక సహాయం అందజేశారు.

చెట్టుపై నుండి పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - తిరువూరు : చెట్టుపైకి ఎక్కి కొమ్మలు నరుకుతూ వ్యక్తి కిందపడి మృతిచెందిన ఘటన మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాల ప్రకారం... తిరువూరు నగర పంచా యతీ కార్యాలయం వెనుక వైపు అద్దె భవనంలో నిర్వహించబడుతున్న పోస్ట్ ఆఫీస్ ఆవరణలో ఉన్న చెట్టు కొమ్మలు నరికేందుకు మునకుళ్ల గ్రామానికి చెందిన తాపీ కార్మికుడు శ్రీకాకుళపు నాగేశ్వరరావు (35) చెట్టుపైకి ఎక్కాడు. కాలు జారడంతో కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ సత్య నారాయణ సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు. నాగేశ్వరావుకు భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. మృతుని కుటుంబానికి రూ.25 లక్షలు ఇవ్వాలని గ్రామస్తులు, కుటుంబ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు.

యుటిఎఫ్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు ప్రారంభం



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్



ప్రసంగిస్తున్న బుద్ధప్రసాద్

ప్రజాశక్తి-అవనిగడ్డ : విద్యాబోధన చేయడంతో పాటు సామాజిక సేవలో కూడా యుటిఎఫ్ సేవలు ఘన కీర్తి కలిగి ఉందని ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ ప్రశంసించారు. యుటిఎఫ్ 50 సంవత్సరాల ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా అవనిగడ్డలో ఆదివారం జిల్లా స్వర్ణోత్సవాలను పురస్కరించుకొని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బుద్ధ ప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొని పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో ప్రతినిత్యం సమాజంలో ఉపాధ్యాయులు గౌరవం పెంచే స్థాయిలో మహెూన్నత కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. సమా జాన్ని తీర్చిదిద్దే ఉపాధ్యాయుడు ఆ సమాజాన్ని కష్టం వచ్చినప్పుడు బాధ్యతగా ముందుండి ఆదుకుంటారనే భావన ప్రజల్లో కలిగించేందుకు యుటిఎఫ్ నిర్వహించే కార్యక్రమాలు దోహద పడుతున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్, ఆయన తనయుడు నియోజకవర్గ యువ నాయకులు మండల వెంకట్రాములను ఘనంగా సత్కరించారు. అనంతరం ఉపాధ్యాయులకు షార్ట్ పుట్ జావి లిన్ త్రో టెన్నికాయిట్ చెస్ షటిల్ క్యారమ్స్ 100 మీటర్లు 400 మీటర్ల పరుగు పందెం పోటీలు నిర్వహించారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు స్పోర్ట్స్ కమిటీ చైర్మన్ బి కనకారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కేఏ ఉమామహేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి జే లెనిన్ బాబు, గౌరవ అధ్యక్షులు నీలం ప్రభాకర్‌రావు, యుటిఎఫ్ నాయకులు శౌకత్ హుస్సేన్, మరీదు వరప్రసాద్, ఎల్ సుభాషిణి, అవనిగడ్డ సబ్ డివిజన్ వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష కార్యదర్శులు కోసూరు పూర్ణచంద్రరావు, గరికపాటి మారుతి తదితరులు పాల్గొన్నారు. స్పోర్ట్స్ కమిటీ జిల్లా కార్యదర్శి బిజీ గోపాలకష్ణ వందన సమర్పణ చేశారు. ఈ పోటీలలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

టెక్నికల్ ఫెస్ట్‌లో గుడ్లవల్లేరు విద్యార్థుల ప్రతిభ



బహుమతులు సాధించిన విద్యార్థులు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : ఆదిత్య పాలిటెక్నిక్, సూరంపాలెం వారు ఈ నెల 13, 14 తేదీలలో రాష్ట్ర స్థాయి టెక్నికల్ ఫెస్ట్‌ను డిప్లొమా విద్యార్థులకు నిర్వహించగా అందులో ప్రథమ, తృతీయ బహుమతులు సాధించినట్లు తమ కళాశాల విద్యార్థులు సాధించారని గుడ్లవల్లేరు ఏ.ఏ.ఎన్.ఎమ్ అండ్ వి.వి.ఆర్.ఎస్.ఆర్‌కళాశాల ప్రిన్సిపాల్ ఎన్ రాజశేఖర్ తెలిపారు. పాలిటెక్నిక్ మెకానికల్ విభాగం విద్యార్థులు ఎమ్.డి.దావూద్ ఖాన్, కె.వి.జ్యోతి ప్రకాష్ లకు పాలీ వేద-2024, ప్రాజెక్ట్ ఎక్సిబిషన్ నానో స్పాట్ వెల్డింగ్ మెషిన్‌లో పాల్గొని మొదటి స్థానాన్ని, ప్రాజెక్ట్ ఎక్సిబిషన్ సోలార్ పవర్ జనరేషన్ ప్లాంట్ అనే అంశంపై సి.హెచ్.జగదీష్ కుమార్, ఏ.వి.ఎస్.అక్షయ్, ఏ.తరుణ్ ఫణింద్ర, డి.నవీన్ బాబు లకు తతీయ స్థానం కైవసం చేసుకున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. విద్యార్థులను చైర్మన్ డాక్టర్ నాగేశ్వరావు వల్లూరిపల్లి, సెక్రటరీచ కరస్పాండెంట్ సత్యనారాయణరావు వల్లూరుపల్లి, కో సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ వల్లూరిపల్లి రామకష్ణ తదితరులు అభినందించారు.

భావితరాల కోసం మొక్కలు నాటండి



ప్రజాశక్తి మచిలీపట్నం రూరల్ : తాగు సాగునీటి ప్రాజెక్టుల తో నవభారత నిర్మాణానికి సేవలు అందించిన గొప్ప ఇంజనీర్ భారతరత్న అవార్డు గ్రహీత మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని వెలుగు ఫౌండేషన్ చైర్మన్ చందమామ బాబు ఆధ్వర్యంలో ఆదివారం ఈడేపల్లి మున్సిపల్ పార్కులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ ఇంజనీర్ రాయపాటి మురళీధర్ ను మచిలీపట్నం నగరపాలక సంస్థ కమిషనర్ సి.హెచ్ బాపిరాజు జిల్లా గ్రంథాలయ సమస్త మాజీ చైర్మన్ గొర్రిపాటి గోపీచంద్ , రాష్ట్రీయ బ్రాహ్మణ సంఘటన రాష్ట్ర నాయకులు, పి. వి. ఫణి కుమార్ లు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కమిషనర్ బాపిరాజు మాట్లాడుతూ ఇంజనీర్ రంగంలో భారతరత్న అవార్డు గ్రహీత మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని గుర్తు చేసుకుంటూ ఇంజనీర్స్ ను సత్కరించుకోవడం గర్వకారణం అన్నారు. ప్రభుత్వం పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టిందని ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటాలని మున్సిపల్ కమిషనర్ బాపిరాజు ప్రజలకు సూచించారు. ఈసందర్భంగా మచిలీపట్నం నగర కార్పొరేషన్ 45వ డివిజన్ మున్సిపల్ పార్క్ ఆవరణలో పెద్ద ఎత్తున మొక్కలను నాటే కార్యక్రమం చేపట్టారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, మైత్రి ఫౌండేషన్ అధ్యక్షులు వేణు కుమార్ చలమల శెట్టి పోతురాజు, డాక్టర్ బొల్లా ప్రసాద్, కాళీపట్నం రఘు పాల్గొన్నారు.

గన్నవరంలో ఎక్కడి సమస్యలు అక్కడే



ఆగిరిపల్లి రోడ్‌లో పేరుకుపోయిన చెత్త కుప్పలు

ప్రజాశక్తి-గన్నవరం : నియోజకవర్గ కేంద్రమైన గన్నవరానికి ఏమైంది.. ఒకవైపు గోతులు పడి పాడైపోయిన రోడ్లు.. మరోవైపు రోడ్లపై మురుగు నీరు.. ఇంకోవైపు ఆగిరిపల్లి రోడ్డు కిరువైపులా కొండల్లా పేరుకుపోతున్న చెత్త కుప్పలు.. ఇది పరిస్థితి. ఈ సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రాంనగర్ లో సిమెంట్ రోడ్డుపై మురుగునీరు రోజుల తరబడి నిలిచిపోవడంతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతుంది. చుట్టుపక్కల జనాలపై ఇళ్లలో దోమలు దాడి చేస్తున్నాయి. జ్వరాలను వ్యాప్తి చేస్తున్నాయి. రాయనగర్ చర్చి రోడ్డు వర్షాలకు దెబ్బతిని గోతులు పడిపోవడంతో వాహనదారులు నరకం చూస్తున్నారు. వైస్ ఎంపీపీ కొమ్మరాజు సుధీర్ ఇంటి పరిసర ప్రాంతాల్లో తారు రోడ్డు పూర్తిగా ధ్వంసం కావడం గమనార్హం. ఇక గన్నవరంలో సేకరించిన చెత్తను ఆగిరిపల్లి రోడ్డులో రెండు వైపులా పోస్తున్నారు. చెత్త పెరిగిపోయి కొండలా తయారవుతోంది. వర్షాలకు చెత్త కుళ్ళిపోయి దుర్వాసన వస్తుందని స్థానికులు చెబుతున్నారు. చెత్త డంపింగ్ సమస్యకు ప్రభుత్వం కానీ ప్రజాప్రతినిధులు కానీ చొరవ చూపడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. సిపిఎం ఆధ్వర్యంలో అనేకసార్లు ఆందోళన చేసిన అధికారులు స్పందన కరువైంది. జిల్లా కలెక్టర్ దీనిపై ప్రత్యేక దృష్టి సారించి చెత్త డంపింగ్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఆ పని చేయకుంటే ప్రజలు డెంగ్యూ రోగాల బారిన పడటం ఖాయం. పంచాయితీలో నిధులు ఉన్న అధికారులు పనులు చేయడానికి ముందుకు రావడం లేదనే వాదన ఉంది. దీనికి కారణం పాలకవర్గంలో ఉన్న విభేదాలే అని చెప్తున్నారు. నిధులు దుర్వినియోగం చేస్తున్నారంటూ అధికారులపై పాలకవర్గ సభ్యులు ధ్వజమెత్తుతున్నారు. ఉన్నతాధికారులకు రిపోర్టులు చేస్తున్నారు. దీంతో పంచాయితీలో సమస్యల పరిష్కారానికి పెద్ద అవరోధంగా మారింది. అధికారులు పన్నులు వేయడం తప్ప.. సమస్యలపై దష్టి పెట్టడం లేదని వార్డు సభ్యులు చెబుతున్నారు.






రాయ్‌నగర్‌లో రోడ్డుపై నిలిచిన మురుగునీరు

నిమజ్జనాల్లో జాగ్రత్తలు పాటించాలి : కలెక్టర్

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా) : జిల్లాలో గణేష్ విగ్రహాల నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. ఆదివారం జిల్లా కలెక్టర్ నగరంలోని కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా అధికారులు, క్షేత్రాధికారులు, పోలీసు అధికారులతో గణేష్ విగ్రహాల నిమజ్జనం ఏర్పాట్లపై టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పలుచోట్ల గణేష్ విగ్రహాల నిమజ్జనం జరగబోతున్నదని అక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. ఆకతాయి పిల్లలతో గొడవలు జరగకుండా శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. నిమజ్జనం జరిగే ప్రదేశాల్లో ముఖ్యంగా మంగినపూడి, తాళ్లపాలెం సత్రయపాలెం, పెదపట్నం ఘంటసాల మండలం శ్రీకాకుళం తదితర ప్రాంతాల్లో ప్రమాదవశాత్తు ఎవరు తప్పిపోకుండా గజ ఈతగాళ్లను, పడవలను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. అంతేకాకుండా మంగినపూడి తాడిగడప వంటి ప్రదేశాలలో చీకటి లేకుండా ఫ్లడ్లైట్లను ఏర్పాటు చేయాలన్నారు. ఈ టెలికాన్ఫరెన్స్లో జిల్లా పోలీసు అధికారి ఆర్ గంగాధర్ రావు, డిపిఓ నాగేశ్వర నాయక్,జిల్లా మత్స్యశాఖ అధికారి చంద్రశేఖర్, అగ్నిమాపక అధికారి ఏసురత్నం, డిఎస్పీలు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.



లడ్డు అందుకుంటున్న కెపి

గణేష్ లడ్డూ @ రూ.20,500

ప్రజాశక్తి-గన్నవరం : రాయనగర్ వాటర్ ట్యాంక్ వద్ద నిర్వహిస్తున్న గణేష్ నవరాత్రి ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. లడ్డు వేలంపాట పెట్టగా కే.కృష్ణప్రసాద్ రూ. 20,500లకు పాడారు. నిర్వాహకులు లడ్డూను కేపీ కుటుంబ సభ్యులకి అందజేశారు. అదేవిధంగా పది రూపాయల దండలకు వేలంపాట నిర్వహించారు. ఆసక్తి కలిగిన యువకులు వాటిని పాట పాడి దక్కించుకున్నారు. అనంతరం గణేష్ విగ్రహాన్ని ట్రాక్టర్ లో ఉంచి ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాయ నగర్ పెద్దలు, యువకులు నాయకత్వం వహించారు. అలాగే కోనాయి చెరువు వద్ద ఉన్న శివాలయంలో గణేష్ నవరాత్రి వేడుకలు ఉత్సాహంగా నిర్వహించారు. చివరి రోజున భోజన ఏర్పాట్లను చిట్టినేని వెంకట్రావు సమకూర్చారు. స్వామివారికి ఆయన బహుకరించిన లడ్డుకు వేలంపాట పెట్టారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు.

నేడు 'మీకోసం' రద్దు

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : మిలాదున్నబి పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే 'మీకోసం' కార్యక్రమం రద్దు చేసినట్లు జిల్లా ఎస్పీ ఆర్ గంగాధర రావు ప్రకటనలో తెలిపారు. కావున ప్రజలందరూ ఈ విషయాన్ని గమనించాలన్నారు.

కొండాలమ్మను దర్శించుకున్న యాత్రికులు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని వేమవరం గ్రామంలో ఉన్న కొండాలమ్మ అమ్మవారి దేవస్థానంలో ఆదివారం సంధర్భంగా శ్రీ అమ్మవారిని సుమారు 15వేల మంది యాత్రికులు దర్శించుకున్నారు. అమ్మవారికి పాలపొంగళ్ళు సమర్పించి వారి మొక్కుబడులు తీర్చుకున్నారు. భక్తులకు ఏ విధమైన అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు దేవస్థాన కార్యనిర్వహణాధికారి కానూరి సురేష్ బాబు తెలిపారు.



రహదారికి మరమ్మతులు

ప్రజాశక్తి - గంపలగూడెం : ఇటీవల పడిన విపరీత వర్షాలతో కట్టలేరు రహదారి మళ్లీ ధ్వంసం అయింది. గతంలో అనేకసార్లు వరదలు వచ్చిన, ఈ స్థాయి పరిస్థితి నెలకొన్న దాఖలాలు లేవు. వరద ఉధృతిని తట్టుకునేలా తిరువూరు ఎంఎల్ఎ కె.శ్రీనివాస్ అదనంగా గత వర్షాలకు ముందు తూరలు వేసి పటిష్టం చేయించారు. అయితే మొన్నటి దెబ్బకు తూరలు సైతం కొట్టుకుపోయాయి. రహదారి తీవ్రమైన గండ్లతో, రాళ్లు తేలి ఓ ప్రత్యేక ఆకృతిని పోలింది. ఈ పరిస్థితుల్లో మరమ్మతులు చేపట్టడం పెద్ద పనిగా మారింది. ఈ విషయంలో ప్రజల గోడు విన్న ఎంఎల్ఎ శ్రీనివాస్ ఆదివారం రహదారి పునర్నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. మరో రెండు రోజుల్లో ప్రయాణికులకు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

వృద్ధురాలి మెడలో గొలుసు అపహరణ

ప్రజాశక్తి - వత్సవాయి : ఓ వృద్ధురాలి మెడలో నానుతాడు లాక్కెళ్ళిన సంఘటన మండలంలోని భీమవరం గ్రామ పరిధిలో చోటు చేసుకుంది. సేకరించిన సమాచారం మేరకు ఆ గ్రామానికి చెందిన భార్య భర్తలు ఇద్దరూ భీమవరం గ్రామం నుండి జగ్గయ్యపేటకు వృద్ధులైన ఇద్దరూ భార్యభర్తలు టివిఎస్ ఎక్సెల్‌పై వెళ్తుండగా మార్గం మధ్యలో హైవేకి దగ్గరలో ఇద్దరూ గుర్తు తెలియని వ్యక్తులు వెనుక నుండి వచ్చి బాబాయ్ అని పిలిచారు. దీంతో వృద్ధుడు వెనుకకు తిరుగగా వెనక కూర్చున్న వృద్ధురాలి మెడలో మంగళసూత్రంతో ఉన్న తాడును లాక్కొని వెళ్లి పారిపోయారు. వత్సవాయి ఎస్ఐ ఉమామహేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుళ్లిన దుంపలు, పాడైన ఉల్లిపాయలు



ప్రజాశక్తి - వత్సవాయి : మండలంలోని సింగవరంలో కురిసిన వర్షాలకు ఇళ్లల్లోకి వర్షపు నీరు పోయినవారికి ప్రభుత్వం వారు 20 కేజీల బియ్యం, బంగాళదుంపలు, ఉల్లిగడ్డలు 20 కుటుంబాల వారికి పంపిణీ చేశారు. ఈ పంపిణీలో సుమారు రెండు కేజీల బంగాళదుంపలు ఇచ్చారు. అవి కడా కుళ్లిపోయినవే ఇచ్చారని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉల్లిపాయలు కూడా కుళ్లిపోయి, దుర్గంధం వెదజల్లుతున్నాయి. ప్రభుత్వం వారు నాణ్యమైన నిత్యావసర సరుకుల్ని అందించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి - విసన్నపేట :

విస్సన్నపేట స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో కనకపూడి రామారావు ఫౌండర్ అండ్ సిఇఒ కెఆర్‌డిఎల్ గ్లోబల్ అమెరికా వారి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని తిరువూరు శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు, కుటుంబ సభ్యుల సమేతంగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ వారు మన నియోజకవర్గంలో మెడికల్ క్యాంపులు ప్రతినెలా నిర్వహిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసిన సంస్థను సభ్యులను సిబ్బందిని కొలిగిపోడు శ్రీనివాసరావు అభినందించారు.



మెడికల్ క్యాంపును ప్రారంభిస్తున్న దృశ్యం

రహదారిపై దిగబడిన లారీ

ప్రజాశక్తి - వత్సవాయి : చిల్లకల్లు –వైరా రహదారిపై లింగాల బ్రిడ్జి వద్ద కుంగిపోయిన రహదారిలో వైరా నుంచి వస్తున్న లారీ హెవీ లోడ్‌తో వస్తుండగా ఆ కుంగిపోయిన రహదారి వద్ద తాత్కాలికంగా మట్టిపోసి రహదారి నడపటానికి ప్రయత్నం చేయటంతో అక్కడికి వచ్చేసరికి అధిక లోడుతో ఉన్న లారీ దిగబడిపోయింది. అదే పక్క ఒకసైడ్‌గా వస్తున్న టాటా ఎసి కూడా వాహనాలు వస్తున్న దారిలో గాడి పడిపోయి దిగుబడిపోయింది. దీంతో ఒక గంట వరకు కూడా వాహనాలు రెండు పక్కల నిలబడిపోయాయి. వాహనదారులు అందరూ సంఘటనా స్థలానికి చేరుకొని టాటా ఎసిని వెనక్కు నెట్టి బయటికి తీశారు. దిగబడిపోయిన సంఘటన స్థలంలో వాహనదారులందరూ కలిసి ఆ గాడులను పూడ్చి వాహనాల యధావిధిగా నడిచేలా ప్రయత్నం చేశారు. దిగబడిపోయిన లారీ జెసిబి సహాయంతో బయటికి లాగారు. హెవీ లోడుతో వాహనాలు తిరగటం వల్ల దిగుబడిపోయి రాకపోకలకు



లారీని బయటకు తీస్తున్న దృశ్యం

అంతరాయం కలుగుతుంది. అధికారులు స్పందించి హెవీ వాహనాలను నిలిపివేయాలని వాహనదారులు కోరుతున్నారు.

మునేరు డ్యామ్ పరిశీలన

ప్రజాశక్తి - వత్సవాయి : రైతులు ఇబ్బందులు పడకుండా పంటలు నష్టపోకుండా సాగునీరు అందిస్తామని స్థానిక శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య అన్నారు. మండలంలోని పోలంపల్లి గ్రామంలో మునేరు డ్యాంనూ పరిశీలించారు. గండ్లు పడ్డ కాలువను కూడా పరిశీలించారు. ఇటీవల కురిసిన



భారీ వర్షాలకు దెబ్బతిని విపరీతంగా గండ్లు పడ్డ మున్నేరు కాల్వకు యుద్ధ ప్రాతిపదికన గుత్తేదారులను పిలిపించి పనులు పరిశీలించారు. త్వరితగతిగా పూర్తి చేయాలని సూచించారు. ఆ పనులను స్వయంగా అనేకసార్లు పరిశీలిస్తూ అధికారులకు, గుత్తేదారులకు ఎప్పటికప్పుడు పనులు త్వరగా పూర్తి కావాలని వారికి ఆదేశాలు జారీ చేశారు. నిరంతరం పర్య వేక్షణ చేస్తూ గండ్లు పూడ్చడమే కాక కాల్వలో పేరుకు పోయిన మేటని తీయించి ఏటి లాకులకు అడ్డుపడ్డ దుంగలు, పొదలు, చెత్త తీయించి రైతాంగం ఆందోళన చెందుతున్నారన్నారు. అత్యంత వేగంగా పనులు చేయిస్తూ శాసనసభ్యులు శ్రీరాం తాతయ్య పోలంపల్లి మున్నేరు డ్యాం నుండి వివిధ హోదాల్లో ఉన్న నాయకులు రైతులు కార్యకర్తలు అధికారులతో కలిసి సాగునీరు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, వివిధ గ్రామాల నాయకులు, రైతులు, కార్యకర్తలు అధికారులు పాల్గొన్నారు. ఇంత త్వరగా పనులు పూర్తి చేయిస్తూ నీటిని విడుదల చేసిన ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్యకు రైతులు, కార్యకర్తలు, ప్రజలు అభినందనలు తెలిపారు.

బాధితులను ఆదుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : వరదలు వచ్చి 15 రోజులవుతున్న ఇంకా ఎస్‌సి కాలనీలోని ఇల్లు వరద నీటిలోనే ఉండటం దుర్మార్గమని సిపిఎం జిల్లా నాయకులు ఏవి ఆంజనేయులు, చేనుమోలు సైదులు అన్నారు. మండలంలోని జయంతిపురం గ్రామంలో గల ఎస్సీ కాలనీలో వరద నీటిలో ఉన్న ఇండ్లను గ్రామస్తులతో కలిసి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంక 50 ఇండ్లు వరద నీటిలో ఉన్నాయని, ఫ్యాక్టరీ క్వారీలు, చెరువు నుండి వస్తున్న ఈ వరద నీరు ఎటు వెళ్లకపోవడంతో ఈ పరిస్థితి దాపురించిందని అన్నారు. ఈ నీళ్లలో కెమికల్ ఫ్యాక్టరీ నుండి రాత్రి వేళలో కెమికల్స్ నీరు వదలడం వల్ల బాధితులకు చర్మ సంబంధిత వ్యాధులు, విష జ్వరాలు, కాళ్లు పాచిపోవడం అంటివి జరుగుతున్నాయని అన్నారు. కాలనీలోకి నీరు రాకుండా చూడాలని, నీళ్లను మోటార్లతో బయటికి తోడించాలని



లేకపోతే సిపిఎం ఆధ్వర్యంలో పోరాటం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కోటా కృష్ణ, గుగులోతు గోపి నాయక్, రావెళ్ల శేషు, దంతాల రాజేశ్వరి, స్థానిక మహిళలు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాలు అందజేత

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: జగ్గయ్యపేట ప్రాంత వరద బాధితులకు విస్సన్నపేట చాంబర్ కామర్స్ 2 లక్షల రూపాయలు విలువ చేసే నిత్యావసర వస్తువులను ఆదివారం జగ్గయ్యపేటలో ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్యకు ఆయన నివాసంలో అందజేశారు. ఇటీవల వచ్చిన వరదలు, తుఫాన్ ప్రభావం వల్ల జగ్గయ్యపేట ప్రాంతంలో అనేక గ్రామాలు ముంపుకు గురై ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తెలుసుకుని సుమారు రూ.2లక్షల విలువ చేసే బియ్యం, నూనెట, ప్యాకెట్లు, బట్టలు, దుప్పట్లు, బ్రెడ్ ఇతర బేకరీ ఐటమ్స్, వాటర్ బాటిల్స్ ను ప్రత్యేక వాహనంలో తీసుకొని వచ్చి ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్యకు అందజేశారు. కార్యక్రమంలో విస్సన్నపేట చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు కుక్కడపు శ్రీరాంబాబు, కుక్కడపు లడ్డు, చెరుకు విజయ్, జగ్గయ్యపేటకు చెందిన ఎల్ఐసి ఏజెంట్ ఉప్పుటూరి రామకష్ణ, జగ్గయ్యపేట మండల టిడిపి అధ్యక్షుడు కట్టా వెంకట నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

నందిగామ : నందిగామ, కంచికచర్ల, చందర్లపాడు మండలాల్లో అంగన్వాడీ వర్కర్ అండ్ హెల్పర్ యూనియన్ (సిఐటియు)ఆధ్వర్యంలో 64 మందికి 10 రకాల సరుకులు, బియ్యం ఆదివారం నందిగామలో పంపిణీ చేశారు. పెండ్యాల గ్రామంలో వరద ప్రభావిత ప్రాంతాల్లో ఉన్న అంగన్వాడి వర్కర్



అండ్ హెల్పర్‌లకు నందిగామ ప్రాజెక్ట్ కమిటీ సహకారంతో 64 మందికి పది రకాల సరుకులు పంపిణీ చేసినట్లు అంగన్వాడీ వర్కర్ అండ్ హెల్పర్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సిహెచ్.సుప్రజా, సిఐటియు జిల్లా కార్యదర్శి కె.గోపాల్, సిఐటియు జిల్లా నాయకులు ఎం.సోమేశ్వరావు, అంగన్వాడీ వర్కర్ యూనియున్ నందిగామ ప్రాజెక్టు కార్యదర్శి కోల్లి సరళ, జర్నలిస్టు సంఘ నాయకులు ఆకుల వెంకట నారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నందిగామ ప్రాజెక్టు కమిటీ సభ్యులు , ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గోపి నాయక్, ప్రజా సంఘాల నాయకులు వి.రవిశేఖర్, లెనిన్, పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకుంటాం: శ్రీరామ్

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: మండలంలోని రావిరాల గ్రామంలో వరద ముంపు ప్రాంతంలో గ్రామస్తులు, నాయకులు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు వరదల కారణంగా జరిగిన నష్టాన్ని ఎంఎల్ఎ రాజగోపాల్‌కు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య మాట్లాడుతూ వరద ముంపు బాధితులను అన్ని విధాల ఆదుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కట్టా వెంకట నరసింహారావు, గ్రామ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

రెడ్యా నాయక్ తండాలో పర్యటన

మండలంలోని రెడ్యా నాయక్ తండాలో వరద బాధితులను ఎంఎల్ఎ శ్రీ రామ్ రాజగోపాల్ ఆదివారం కలిశారు. వారితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. గ్రామస్తులు మాట్లాడుతూ కరెంటు పోల్స్, వ్యవసాయ ట్రాన్స్ఫారమ్ లు,కరెంటు మోటర్లు, గృహాలు కొట్టుకు పోయాయని, 30 ఎకరాలు పంట దెబ్బతిందన్నారు. రైతులతో కలిసి దెబ్బతిన్న ప్రాంతాలను పరిశీలించారు. అక్కడున్న పరిస్థితులను బట్టి జెసిబితో పనులు చేయించాలని అధికారులకు సూచించారు.

నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : సమాచార హక్కు చట్ట న్యాయ పోరాట సమన్వయ కమిటీ, సమాచార హక్కు చట్ట ప్రజా రక్షణ భేరి కమిటీ జిల్లా అధ్యక్షులు రాంబాబు ఆధ్వర్యంలో ఐడి కార్డులు, అపాయింట్మెంట్ లెటర్స్, సర్టిఫికెట్‌లను నియోజకవర్గ కమిటీ, మండల కమిటీ సభ్యులకు అందజేశారు. జగ్గయ్యపేట నియోజకవర్గ అధ్యక్షులు కె.వి.రత్నం, మండల వైస్ ప్రెసిడెంట్ వి.కృష్ణవేణి–ట్రెజరీ కె బుజ్జి బాబు, లీగల్ అడ్వైజర్ వై.భాను, నియోజకవర్గ వింగ్ ప్రెసిడెంట్, నియోజకవర్గ వైస్ ప్రెసిడెంట్ వి.శిరీష, నియోజకవర్గ వీడో వింగ్ ప్రెసిడెంట్ అర్.కృష్ణవేణి, నియోజకవర్గ మీడియా వింగ్ ప్రెసిడెంట్ టి.దుర్గ, నియోజకవర్గ యూత్ వింగ్ ప్రెసిడెంట్ సిహెచ్.వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

గీతాంజలి హైస్కూల్ విరాళం

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : బుడమేరు వరదల సహాయార్థం అప్పాడెమో క్రాటిక్ పిలుపు మేరకు రెడ్డిగూడెం గీతాంజలి హైస్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, యాజమాన్యం, సిబ్బంది ద్వారా సేకరించిన రూ.2.15లక్షలు నగదును ముఖ్యమంత్రి సహాయ నిధికి పంపిస్తున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.మల్లికార్జున రెడ్డి, కరెస్పాండెంట్ కె.కోటిరెడ్డి తెలిపారు. విద్యార్థులు తాము దాచుకున్న పాకెట్ మనీ, విద్యార్థులందరూ తమ కుటుంబ సభ్యుల నుంచి, తమ పొరుగు వారి నుండి సేకరించిన విరాళాలు, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, మేనేజ్ మెంట్ నుండి ఈ మొత్తాన్ని సేకరించామని తెలిపారు.



బాలిక కుటుంబాన్ని ఆదుకోవాలి : ఐద్వా



మాట్లాడుతున్న ఐద్వా నాయకులు

ప్రజాశక్తి కలక్టరేట్ (కష్ణా) : మచిలీపట్నం గుమస్తాల కాలనీలో నివాసముంటున్న బాలికపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని, ఆ కుటుంబానికి ప్రభుత్వం రక్షణ కల్పించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం మచిలీపట్నం నగర కార్యదర్శి కొడాలి సుజాత రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఆదివారం స్థానిక జ్యోతిబాపూలే విజ్ఞాన కేంద్రం లో అఖిల భారత ప్రజా తంత్ర మహిళా సంఘం మచిలీపట్నం కమిటీ ఆధ్వర్యంలో మచిలీ పట్నంలో మైనర్ బాలికపై జరిగిన అత్యాచారాన్ని ఖండిస్తూ విలేకరుల సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా కార్యదర్శి కే. సుజాత మాట్లా డుతూ బాలిక కు సంబంధించి తల్లి పుట్టి అందురాలు, కుటుంబానికి ఎటువంటి పోషణ లేదు కావున ప్రభుత్వం ఆదుకుని కుటుంబానికి ఆర్థిక సహాయం చేయాలని, బాలిక చదువు ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఆ బాలిక తల్లికి ఇళ్ల స్థలం కేటాయించాలని, ప్రభుత్వ ఉద్యోగం కేటాయించాలని సుజాత డిమాండ్ చేశారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా కమిటీ సభ్యురాలు పరస.లక్ష్మీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో గంజాయి రహిత రాష్ట్రం చేస్తావని చెప్పారని, కానీ బందరులో అనేక చోట్ల గంజాయి అమ్ముతున్నా పట్టించుకోకపోవడం శోచనీయ మన్నారు. బాలికపై అత్యాచారానికి పాల్పడిన పవన్ కుమార్ కూడా గంజాయి సేవిస్తూ గొడవులకు పాల్పడే వ్యక్తి అని, అతనికి సహకారం ఇస్తున్న వ్యక్తులను కూడా అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని ఆమె డిమాండ్ చేశారు. ఐద్వా పట్టణ కమిటీ సభ్యురాలు బూర. భవాని మాట్లాడుతూ ఐద్వా సంఘంగా ఆ కుటుంబానికి న్యాయం జరిగేంత వరకు అండగా ఉంటామని ప్రభుత్వ కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అత్యాచారం జరిగిన మైనర్ బాలిక కుటుంబాన్ని ఐద్వా మచిలీపట్నం కమిటీగా పరామర్శించివారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

కృష్ణా జిల్లాలో 682 ఎకరాల ఫ్రీహోల్డ్ భూములు : కలెక్టర్

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : ఈనెలాఖరు లోగా ఫ్రీ హెూల్డ్ భూముల రికార్డుల పరిశీలన కార్యక్రమం పూర్తి చేయాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి ఆర్‌పి సిసోడియా జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఆదివారం ఉదయం ముఖ్య కార్యదర్శి సీసీఎల్‌ఏ జి జయలక్ష్మి తో కలసి రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కలెక్టర్లతో ఫ్రీ హెూల్డ్ భూములపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి జిల్లాల వారిగా సమీక్షించారు. ఈ సందర్భంగా ముఖ్య కార్యదర్శి మాట్లాడుతూ ఫ్రీ హెూల్డ్ భూముల పరిశీలన కార్యక్రమాన్ని వేగవంతం చేసి ఈనెలాఖరు లోగా పూర్తి చేయాలన్నారు. పరిశీలన పూర్తయ్యాక లోటు పాట్లు ఏమైనా ఉంటే ప్రభుత్వ నిర్ణయం మేరకు తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ మాట్లాడుతూ జిల్లాలో 682 ఎకరాలు ఫ్రీ హెూల్డ్ భూములుగా గుర్తించామని, అందులో ఇప్పటివరకు 11.9 ఎకరాలు రిజిస్ట్రేషన్ జరిగిందని, 142 ఎకరాల మేరకు రికార్డులను పరిశీలన చేశామని వివరించారు. మిగిలిన భూములకు సంబంధించిన రికార్డులను ఒక వారంలోగా పూర్తి చేస్తామని చెప్పారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మ, కలెక్టరేట్ భూ విభాగం పర్యవేక్షకులు నెల్సన్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవా రంగంలో 'వెంకట్'కు అవార్డు



అవార్డు అందుకుంటున్న వెంకట్

ప్రజాశక్తి-గన్నవరం : సామాజిక సేవా రంగంలో హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ చైర్మన్ సంకా బత్తుల వెంకట్ చేస్తున్న సేవలను గుర్తించి జాతీయ స్దానంలో నంది అవార్డును కాళోజీ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్ విత్ అసోసియేట్ నేషనల్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆఫ్ న్యూఢిల్లీ వారు అందించారు. విజయవాడ బాలోత్సవం భవన్‌లో ఆదివారం గిడుగు వెంకట రామమూర్తి పంతులు జయంతి సందర్భంగా తెలుగు బాషా దినోత్సవం కార్యక్రమం జరిగింది. జాతీయ స్థాయిలో వివిధ రంగాల్లో సేవలు చేసిన వారు నంది అవార్డు తీసుకోవడానికి ఒరిస్సా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, మహరాష్ట్ర రాష్ట్రం నుండి వచ్చారు. ఈ సందర్భంగా హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ చైర్మన్ సంకాబత్తుల వెంకట్ అవార్డు పొందారు. జాతీయ స్థాయిలో సేవా రంగంలో నంది అవార్డు తీసుకున్న హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ చైర్మన్ సంకాబత్తుల వెంకట్‌ను ఆంధ్రప్రదేశ్,తెలంగాణ రాష్ట్రాల నుండి పలువురు ప్రముఖులు అభినందించారు. ఈ కార్యక్రమంలో నాసా శాస్త్రవేత్త చందు సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు సాయం



తోట్లవల్లూరులో సాయం అందిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-తోట్లవల్లూరు : ఇటీవల సంభవించిన వరదల వల్ల సర్వం కోల్పోయిన బాధితులకు ఉపాధ్యాయులు తమ వంతు సాయం అందించి మానవత్వం చాటుకున్నారు. మండలంలోని దేవరపల్లి గ్రామ శివారు పొట్టిదిబ్బలంక పూర్తిగా వరద ముంపుకు గురైంది. నిర్వాసితులు సర్వం కోల్పోయారు. ఆదివారం ఉపాధ్యాయులు ఒక మిత్ర బందంగా ఏర్పడి వి.శ్రీనివాసప్రసాద్ మాస్టర్ ఆధ్యర్యం లో వారి స్నేహితులు జగదీశ్, ఎస్.పోతురాజు, ఎం. మాధవరావు, కె.శ్రీనివాస్ సహాయ సహకారాలతో గ్రామం లోని 65 మంది కి దుప్పట్లు, లుంగీలు, టవల్స్ , చీరలు, బిస్కెట్‌లు బాధితులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో మండలం యుటిఎఫ్ అధ్యక్షురాలు సిహెచ్ మైదిలి, ప్రధాన కార్యదర్శి ఎం . విజయశ్రీ పాల్గొన్నారు. **ప్రజాశక్తి-అవనిగడ్డ :** ఇటీవల కృష్ణా నదికి వచ్చిన వరదల వల్ల సర్వం కోల్పోయిన కుటుంబానికి జనసేన నాయకులు సాయం అందించారు. మండల పరిధిలోని పులిగడ్డ శివారు రేగులంకలో నివాసం ఉంటున్న దిడ్ల సుశీల నివాసాన్ని ఆదివారం నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్ రామ్ జనసేన నాయకులతో కలసి పరిశీలించారు. సుశీల ఇల్లు వరదల తాకిడికి దెబ్బతినడంతో వారి సమస్యను జనసేన ఎన్నారైలు లేబాక శ్యామ్ కుమార్, శ్రీ లావణ్య దంపతులు ఇందుర్తి సునీల్ రమా మార్తా దష్టికి తీసుకువెళ్లగా వారి సహకారంతో 50 వేల వ్యయంతో గహాన్ని పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయించి రంగులు వేయించి అన్ని విధాలుగా అండగా నిలిచారు. ఈ సందర్భంగా వెంకట్రామ్ మాట్లాడుతూ ఇబ్బందులు పడుతున్న కుటుంబానికి జనసేన ఎన్‌ఆర్‌ఐలు స్ఫూర్తిదాయకులని కొనియాడారు కాగా సుశీల భర్త ఇటీవల మృతి చెందగా ఆమెకు ప్రభుత్వం ద్వారా ఎన్టీఆర్ భరోసా పింఛన్ మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. జనసేన పార్టీ అవనిగడ్డ మండల శాఖ అధ్యక్షులు గుడివాడ శేషుబాబు, ఉపాధ్యక్షులు దొంగల నరేష్, ప్రధాన కార్యదర్శి మండలి శివప్రసాద్, పార్టీ గ్రామ అధ్యక్షులు మండలి ఉదయ్ పాల్గొన్నారు. **ప్రజాశక్తి - గుడివాడ :** నందివాడ మండలంలోని వరద ముంపు గ్రామాల్లో హెచ్‌సిఎల్ సంస్థ సమకూర్చిన నిత్యావసర సరుకుల కిట్లను ఎంపి వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆదివారం పంపిణీ చేశారు. మండలంలోని ఒద్దులమెరక, చేదుర్తిపాడు తదితర గ్రామాల్లోని బాధిత కుటుంబాలకు 15 రకాల నిత్యావసరాలతో కూడిన 500 కిట్లను ఎంపి బాలసౌరి, ఎమ్మెల్యే రాము, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నందివాడ మండలంలో ప్రజల వరద కష్టాలను స్వయంగా చూశామని, ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందన్నారు. జనసేన నాయకులు బూరగడ్డ శ్రీకాంత్, మండల టిడిపి అధ్యక్షుడు దానేటి సన్యాసిరావు, నాయకులు పాల్గొన్నారు.



అవనిగడ్డ మండలంలో మహిళకు సాయం అందిస్తున్న దృశ్యం



నిత్యావసర కిట్లు అందజేస్తున్న దృశ్యం

బాధితులకు అండగా గుడివాడ సైక్లింగ్ క్లబ్

ప్రజాశక్తి - గుడివాడ : నందివాడ మండలంలో ఇటీవల వచ్చిన వరదలతో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలకు గుడివాడ సైక్లింగ్ క్లబ్, మ్యాన్‌కైండ్ ఫార్మా సంస్థలు 100 నిత్యావసర కిట్లను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సైక్లింగ్ క్లబ్ సభ్యులు డాక్టర్ మాగంటి శ్రీనివాస్ మాట్లాడుతూ ఇటీవల వరదల సమయంలో బాధిత ప్రజలకు గుడివాడ సైక్లింగ్ క్లబ్ 15 వందల ఆహార ప్యాకెట్లను సమకూర్చా మన్నారు. వరద ప్రభావం తగ్గిన తర్వాత ప్రజలకు దుప్పట్లు, బ్లాంకెట్స్ ఇతర నిత్యావసరాలను కిట్లుగా రూపొందించి పంపిణీ చేశామన్నారు. తమకు సహకరించిన మ్యాన్‌కైండ్ ఫార్మా సంస్థకు ధన్యవాదాలు తెలియజేశారు. భవిష్యత్తులో బాధిత గ్రామాల్లో మరిన్ని కార్యక్రమాలను సైక్లింగ్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తా మన్నారు. ఈ కార్యక్రమంలో గుడివాడ సైక్లింగ్ క్లబ్ సభ్యులు డాక్టర్.సూరజ్, డాక్టర్ శ్రీనాథ్, డాక్టర్ శ్రావ్య, క్లబ్ పెద్దలు శాస్త్రి, హరీష్, గుప్తా, మోనీష్, గ్రామ పెద్దలు శివయ్య, మ్యాన్‌కైండ్ ఫార్మా సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

బాలుడికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : మచిలీపట్నంలోని స్థానిక డ్రైవర్స్ కాలనీకి చెందిన శ్యామ్ సంతోష్ అనే బాలుడు బాలాజీ విద్యాలయంలో 7వ తరగతి చదువుతున్నాడు .ఇటీవల తరచూ అనారోగ్యం పాలవుతుండడంతో హాస్పిటల్‌లో చూపించగా బాలుని 2 కిడ్నీలు ఫెయిల్ అయ్యాయని, దాని చికిత్స నిమిత్తం లక్షల్లో ఖర్చు అవుతాయని వైద్యులు తెలిపారు.ఈ విషయం తెలుసుకున్న స్కూల్ యాజమాన్యం కొంత ఆర్థిక సాయం చేశారు. అలాగే మచిలీపట్నం బెల్ కంపెనీ ఉద్యోగులు, మైత్రీ ఫౌండేషన్ సంయుక్తంగా ఆదివారం బాలుని కుటుంబానికి రూ.25,000 చెక్ అందించి సాయం చేశారు. బాలాజీ విద్యాలయం లో జరిగిన ఈ కార్యక్రమంలో బాలుని తల్లితండ్రులు బాలాజీ విద్యాలయం యాజమాన్యం మైత్రీ ఫౌండేషన్ చేసిన సహాయానికి ధన్యావాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మైత్రీ ఫౌండేషన్ అద్యక్షులు వేణు కుమార్, గౌరవ అధ్యక్షులు వరప్రసాద్,సభ్యులు కనకరాజు, రమణ, ఫణి, రీలాక్స్ ప్రసాద్,నిరంజన్ రావు, రహీమ్ మాస్టారు,ఆదిశేషు బెల్ ఉద్యోగులు ఆరిఫ్, మణిబాబు తదితరులు పాల్గొన్నారు.

బుద్ధప్రసాద్ పరామర్శ

ప్రజాశక్తి-కోడూరు : చిరంజీవి యువత అవనిగడ్డ నియోజకవర్గ అధ్యక్షులు, జనసేన పార్టీ నాయకులు సిద్ధినేని అశోక్ నాయుడును అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆదివారం పరామర్శించారు. కోడూరు మండలం ఉల్లిపాలెంలో మాతృవియోగానికి గురైన అశోక్ నాయుడును వారి స్వగహంలో ఎమ్మెల్యే పరామర్శించారు. ఆయన వెంట, మాజీ జడ్పిటిసి సభ్యులు బండే శ్రీనివాసరావు, జనసేన పార్టీ నాయకులు ఉల్లి శేషగిరిరావు, దామెర్ల నారాయణ, బచ్చు వెంకటేష్ ఉన్నారు.

పన్నులు చెల్లించండి

ప్రజాశక్తి-విజయవాడ : విజయవాడ నగర పాలక సంస్థ పరిధిలోని ఆస్థి పన్ను బకాయిదారులు తమ ఆస్తి పన్ను, కుళాయి చార్జీలు, డ్రైనేజి చార్జీలు, వాటర్ మీటర్ చార్జీలు, ఖాళీ స్థలముల పన్నులను ఈ అర్ధ సంవత్సరం ఈనెల 30వ తేదీలోపు చెల్లించాలని నగరపాలక సంస్థ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలోని 3 సర్కిల్ కార్యాలయాల పరిధిలో, నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం ఉదయం 8.00 గంటల నుండి రాత్రి 8.00 గంటల వరకు అన్ని శెలవు దినములలో కూడా తెరచి ఉంచబడునని తెలిపారు.

సామ్‌సంగ్ ఛానల్ సేవల విస్తరణ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : సామ్‌సంగ్ బ్రాండ్ ఉచిత యాడ్ సపోర్టెడ్ స్ట్రీమింగ్ టీవీ (ఫాస్ట్) సర్వీస్ అయిన సామ్‌సంగ్ టీవీ ప్లస్ తన పోర్ట్‌ఫోలియోలో నాలుగు కొత్త ఛానెల్‌లను ప్రారంభించడానికి ప్రణాళిక సిద్ధం చేసినట్లు శాంసంగ్ గ్రూప్ ఇన్చార్జి కె.రాజ శేఖర్ తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. ఇండియా టీవీ యోగా ఇప్పుడు సామ్‌సంగ్ టీవీ ప్లస్ ప్లాట్‌ఫామ్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. వీక్షకులు ఇప్పుడు వార్తలు, కరెంట్ అఫైర్స్, ఫిట్‌నెస్, వినోదం నుండి విస్తతమైన అధిక నాణ్యత కంటెంట్ ఆఫర్‌లకు సులభంగా వీక్షించి ఆస్వాదించవచ్చని తెలిపారు. సామ్‌సంగ్ టీవీ ప్లస్ వీక్షకులకు 100 కంటే ఎక్కువ లైవ్ టివి ఛానెల్‌లు, వేలకొద్దీ చలనచిత్రాలు, షోలకు లైవ్, ఆన్ డిమాండ్ రెండింటికీ యాక్సెస్ కల్పిస్తోందని తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్

ప్రజాశక్తి - తిరువూరు : అక్రమంగా తెలంగాణకు ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసి సంబంధిత యజమానులపై వోల్టా చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. గంపలగూడెం మండలం, అమ్మిరెడ్డి గూడెం గ్రామానికి చెందిన పల్లపు శ్రీనివాసరావు, తిరు పతిరావు కట్టలేరు వాగులో నుండి తమ ట్రాక్టర్ల ద్వారా ఇసుకను సరిహద్దు తెలంగాణ రాష్ట్రానికి తరలిస్తుండగా ఎర్రమాడు వద్ద అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ చెప్పారు. ట్రాక్టర్లను సీజ్ చేసి శ్రీనివాసరావు, తిరుపతి రావులపై వోల్టా కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

రూ.26 లక్షలు పలికిన వినాయకుని లడ్డు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : నున్న పంచాయతీ పరిధిలోని పవర్ గ్రిడ్ సెంటర్ శ్రీ సాయి బాలాజీ ఎన్‌క్లేవ్ అపార్ట్మెంట్‌లో నెలకొల్పిన వినాయక విగ్రహం విపోధా ఫిస్ట్రైర్ సోల్యుషన్స్ ప్రవేట్ లిమిటెడ్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్లు సింగం రెడ్డి ప్రధీప్ రెడ్డి, నక్కా రామ్ బాలజీ వేడుకల చివరి రోజు నిర్వహించిన వేలంలో లడ్డు ప్రసాదాన్ని రూ.26 లక్షలకు సొంతం చేసుకున్నారు. విజయవాడ రూరల్‌లో నెలకొల్పిన వినాయక మండపంలో ఈ లడ్డు వేలం పాట పెద్ద మొత్తంలో హైలైట్‌గా నిలిచింది.. శ్రీ సాయి బాలాజి ఎన్ క్లేవ్ అపార్ట్ మెంట్ లో వినాయక చవతి నిర్వహణా కమిటీ సభ్యులు బ్రహ్మం, రాజేష్, ప్రదీప్‌కు లడ్డు వేలం పాడిన మొత్తాన్ని అందజేశారు. లడ్డు వేలం విజేతను కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా లడ్డు భారీ మొత్తంలో పాడుకున్న విజేత సింగం రెడ్డి ప్రదీప్ రెడ్డి మాట్లాడుతూ రాబోయే రోజుల్లో అపార్ట్మెంట్ అభివృద్ధి కార్యక్రమాలకు, వచ్చే ఏడాది అపార్ట్‌మెంట్లో వినాయక చవితి వేడుకలు మరింత వైభోవోపేతంగా నిర్వహించుకోవాలనే సదుద్దేశంతోనే రూ.26 లక్షల పెద్ద మొత్తానికి వినాయక లడ్డు పాట పాడామని పేర్కొన్నారు. ఈ ఏడాదికి మించి వచ్చే ఏడాది తమ అపార్ట్‌మెంట్‌లో వినాయక చవితి వేడుకలు నిర్వహిస్తామని ఈ సందర్భంగా కమిటీ నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు.



వేలంలో లడ్డూను సొంతం చేసుకున్న ప్రదీప్ రెడ్డి

సిపిఎం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో

కొనసాగుతున్న ఆహార పంపిణీ కేంద్రాలు

ప్రజాశక్తి - భవానీపురం : వైఎస్ఆర్ కాలనీ వరద బాధితులకు రెండో రోజు ఆదివారం ఆహార పంపిణీ కార్యక్రమం మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రం సహకారంతో నిర్వహించారు. ఈ ఆహార పంపిణీ కార్యక్రమంలో సిపిఎం పశ్చిమ నగర కార్యదర్శి కార్పొరేటర్ బోయి సత్యబాబు పాల్గొని మాట్లాడుతూ వరద బాధితుల నష్టపరిహారాలు వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పారిశుధ్య పనులు పూర్తి చేయాలని, సిబ్బంది సంఖ్యను పెంచాలని కోరారు. బి.కాలనీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు పెండింగ్ జీతాలు వెంటనే విడుదల చేయాలన్నారు. కబేళా ఊర్మిళానగర్, వైఎస్ఆర్ కాలనీ, భవానీపురం ఓల్డ్ ఆర్ఆర్ పేట, కంసాలిపేట, వించిపేట ప్రాంతాల్లో వరద తీవ్రతకు నష్టపోయిన వారందరికీ వెంటనే తక్షణం రూ.25 వేలు చొప్పున కుటుంబానికి నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. చిన్న పరిశ్రమలు, చిన్న వ్యాపారాల్లో నష్టాన్ని అంచనా వేసి పరిహారం చెల్లించాలన్నారు. ఉపాధి కోల్పోయిన కార్మికులకు కొత్తగా ఉపాధి అవకాశాలు కల్పించాలని, మంచినీటి సరఫరా అన్ని బ్లాక్‌లకు వెళ్లే లాగా మోటార్లు ఏర్పాటు చేయాలన్నారు. హైస్కూల్లో పాడైపోయిన పంపుసెట్టు వెంటనే బాగు చేయాలని విజ్ఞప్తి చేశారు. హైస్కూల్లో పాడైపోయిన కిచెన్ రూమ్‌లో రేషన్ బియ్యం తొలగించి మంచి సరుకులు అందించాల్సిన అవసరం ఉందన్నారు. బాధితులకు అందించిన రేషన్ బియ్యం నాసిరకం బియ్యం ఆటగట్టడం అన్యాయమన్నారు. సన్నబియ్యం అందించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర విపత్తుగా ప్రకటించి వరద సహాయ నిధులు వెంటనే విడుదల చేయాలని కోరారు. పాడైపోయిన పరుపులు, దిండ్లు, దుప్పట్లు, మంచాలు వెంటనే అందించాలన్నారు. ఉచిత ఆహార కేంద్రాలు కనీసం నెలరోజులు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సేవా కార్యక్రమంలో ఉపాధ్యక్షులు విక్రమ్ లక్ష్మి, సాధమ్మ, సిఐటియు నాయకులు ఎస్.సుబ్బారెడ్డి, జి.నాగరాజు, బి.దుర్గారావు, కాలనీ కమిటీ నాయకులు గంగరాజు, కె.రవి తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం : సిపిఎం ఆధ్వర్యంలో 9 రోజుల నుంచి వరద బాధితుల సహాయార్థం కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య స్మారక భోజన కేంద్రం ఫెర్రీ రామాలయం వద్ద ఇబ్రహీంపట్నంలో గాజుల పేట, ప్రసాద్ నగర్, సెంటు స్థలాల్లో, ఇసుక రేవు, దుర్గా కాలనీ, కొండపల్లి శాంతి నగర్ ఇందిరమ్మ కాలనీలలో సిపిఎం ఆధ్వర్యంలో భోజనాలు వందలాది మందికి ఏర్పాటు చేశారు. అనేకమంది దాతలు సహకరించి ఈ కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహించినందుకు వారికి నాయకులు అభినందనలు తెలిపారు. విజయవాడ తర్వాత ఇబ్రహీంపట్నం మండలం, కొండపల్లి ఇందిరమ్మ కాలనీ, శాంతి నగర్, ఎస్టీ కాలనీ, అరుణ నగర్ బాగా ముంపుకు గురయ్యాయని విజయవాడ తరహా ఇబ్రహీంపట్నం మండలంలో వరద బాధితులకు ఆర్థిక సహకారం అందించాలని సిపిఎం ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శి మహేష్ డిమాండ్ చేశారు. వరదలు తగ్గినా నేటికీ పనులు లేక చాలామంది పస్తులు ఉంటున్నారని ఈ నేపథ్యంలోనే సిపిఎం భోజనాల కేంద్రాలు ఏర్పాటు చేసిందని ప్రభుత్వం నిత్యావసర సరుకులు బియ్యం ఇచ్చిన వండుకోవడానికి గ్యాస్ పొయ్యి లేక కట్టెల దొరక్క ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే ఆర్థిక సహాయం అందించేందుకు ఏర్పాట్లు వేగవంతం చేయాలని కోరారు. చాలామంది అద్దెకి ఉండే పరిస్థితి ఉందని తెలిపారు. కొండపల్లి మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుడికి మున్సిపల్ కౌన్సిలర్లు అధికారులు ప్రజా ప్రతినిధులు ఆర్థిక సాయం అందించి మెరుగైన వైద్యం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు వి.రామసీతా కృష్ణరాయులు, కామేశ్వరరావు బాబూరావు, ఆల్ ఇండియా లాయర్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఆవుల వెంకటరావు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నంలో భోజనం వడ్డిస్తున్న నాయకులు



వైఎస్ఆర్ కాలనీలో వరద బాధితులకు ఆహారం పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ బోయి సత్యబాబు

వరద బాధితుల సేవల్లో ప్రజావైద్యశాల



పైపుల రోడ్డులో ఏర్పాటు చేసిన శిబిరం

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : కీర్తిశేషులు డాక్టర్ మాకినేని రామారావు నేతృత్వంలో నడుస్తున్న విజయవాడ గవర్నరుపేటలోని ప్రజావైద్యశాల ఆధ్వర్యంలో నగరంలోని పలు వరద ప్రభావిత ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు కొనసాగుతున్నాయి. కిరణ్స్ వ్యాస్కులార్ సర్జరీ సెంటర్ నిర్వాహకులు డాక్టర్ మాకినేని కిరణ్ నేతృత్వంలోని వైద్య బృందం అజిత్‌సింగ్‌నగర్, రాజీవ్‌నగర్, వాంబేకాలనీ, రాజరాజేశ్వరిపేట, ఉడా కాలనీ, పైపులరోడ్డు, వడ్డెర కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించింది. ఆయా ప్రాంతాల్లో దగ్గు, జలుబు, జ్వరాలు, వాంతులు, విరోచనాలు, చర్మవ్యాధులతో అక్కడి ప్రజానీకం బాధపడుతున్నారని బందం గుర్తించింది. ఈ నేపథ్యంలో పైన పేర్కొన్న ప్రాంతాల్లో ఉచితవైద్య శిబిరాలను ఏర్పాటుచేసింది. ప్రజావైద్యశాల సిబ్బంది వరద ముంపు ప్రాంత బాధితులకు ఆరోగ్యపరమైన వైద్యసేవలను అందిస్తున్నారు. ప్రజావైద్యశాల రక్త నాళాల శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ మాకినేని కిరణ్ నేతత్వంలో డాక్టర్ జిలానీ ఆసుపత్రి సిబ్బంది ఎం.ప్రభాకర్, శ్రావణి, సిసింద్రి తదితరులు సేవలు అందిస్తున్నారు. ఇప్పటివరకూ 10వేల మంది వరకూ ఉచితంగా వైద్యం అందించటంతోపాటుగా మందులను సైతం ఉచితంగా పంపిణీచేశారు.



మందులు పంపిణీ చేస్తున్న ఆస్పత్రి సిబ్బంది



మా వంతుగా వైద్య సేవలందిస్తున్నాం : కిరణ్స్ వ్యాస్కులార్ సర్జరీ సెంటర్ నిర్వాహకులు డాక్టర్ మాకినేని కిరణ్

వరదల వల్ల అనేక రకాల వ్యాధుల బారిన పడుతున్న వారికి మానవతా దృక్పథంతో ప్రజావైద్యశాల ఆధ్వర్యంలో తమ వంతుగా ఉచిత వైద్య శిబిరాలను వరద ప్రభావిత ప్రాంతాల్లో నిర్వహిస్తున్నామన్నారు. వారం రోజులుగా శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేస్తున్నామని తెలిపారు.

బిల్డింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ కార్యాలయం ప్రారంభం



మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ కృష్ణా జిల్లా నూతన కార్యాలయ ప్రారంభోత్సవ ఆత్మీయ సమావేశం గురునానక్ కాలనీ సమీపంలోని డైరీ కాలనీలో ఆదివారం జరిగింది. కృష్ణా జిల్లా నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. ఇంజనీర్స్ డేను పురస్కరించుకొని ప్రముఖ ఇంజనీర్ మోక్షగుండం విస్వేస్వరయ్యకు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా మాజీ ఉపాధ్యక్షులు వల్లభనేని వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బుడమేరుకు గండి పడినప్పుడు, తాను ఆ గండి పూడ్చే పనులు వీలైనంత త్వరగా పూడ్చి విజయవాడ వాసులకు తమ వంతు సహాయం చేశామన్నారు. ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ స్మాల్ అండ్ మీడియం ఇండస్ట్రీస్ అసోసియేషన్ అధ్యక్షులు మురళీకృష్ణ మాట్లాడుతూ ఎంఎస్ఎంఇలకు ఉన్న సౌలభ్యాలు, ఉపయోగాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఐసి డిప్యూటీ మేనేజర్ టిడి కిరణ్ పాల్, బాయ్ ఏపీ అధ్యక్షుడు నాగమల్లేశ్వరరావు, సబ్కా జిల్లా అధ్యక్షులు ఎంఆర్‌డి ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

స్పెల్‌బి పోటీలు

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : ఎస్‌బిఐ లైఫ్ ఇన్సూరెన్స్, మిర్చి సంయుక్తంగా 14వ ఎస్‌బిఐ లైఫ్ స్పెల్ బి 2024 ఎడిషన్ 'బి స్పెల్‌బౌండ్'ను ఆవిష్కరించినట్లు సంస్థ ఇన్ఛార్జి కె.రాంబాబు ఆదివారం ప్రకటనలో తెలిపారు. స్పెల్‌బి అనేక సంవత్సరాలుగా ప్రతిభావంతులైన యువతను తీర్చిదిద్దే, వెలుగులోకి తెచ్చే వేదికగా పలు కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. 30 నగరాలు, 500 పైగా పాఠశాలల వ్యాప్తంగా 14వ విడత కాంపిటీషన్ నిర్వహించబడు తుందని తెలిపారు ఇందులో మూడు లక్షల మంది పైగా విద్యార్థులు పాల్గొననున్నారని తెలిపారు.